మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

ఆదివారం 05-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 165

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

**విలేకరులు కావలెను**




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

## పాక్‌కు షాకిచ్చిన యూఏఈ..



- వెంటనే అప్పు తీర్చాలని అల్టిమేటం..
- 3. 5 బిలియన్ డాలర్ల అప్పు కట్టాల్సిన పరిస్థితి
- 30 ఏళ్ల అప్పు తీర్చబోతున్న పాక్

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్‌కు యూఏఈ షాకిచ్చింది. తమ దగ్గర తీసుకున్న అప్పును పూర్తిగా, అది కూడా వెంటనే చెల్లించాలని కోరింది. దీంతో ఈ నెలలోనే యూఏఈ అప్పు తీర్చేందుకు పాక్ సిద్ధమైంది. మొత్తం 3.5 బిలియన్ డాలర్ల అప్పును యూఏఈకి పాకిస్తాన్ ఈ నెలలోనే చెల్లించబోతుంది. ఒకవైపు అంతర్జాతీయ రిజర్వ్లు తక్కువగా ఉన్నా, మరోవైపు ఐఎంఎఫ్ నుంచి ఒత్తిడి ఉన్నా.. పాక్ తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు

-మిగతా 3 లో

## సైన్యం కోసం కంపెనీల బాటకు రష్యా!

- ఉక్రెయిన్‌తో యుద్ధంలో 3.2 లక్షల మంది జవాన్ల నష్టం
- సైన్యానికి ఉద్యోగులను ఇవ్వాలని సంస్థలకు రష్యా ఆదేశం!



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

ఉక్రెయిన్‌తో నాలుగేండ్లుగా సాగుతున్న యుద్ధంలో 3.5 లక్షల మంది సైనికులను కోల్పోవడం రష్యాకు భారీ నష్టాన్ని మిగిల్చింది. దీంతో సైన్యం కోసం రహస్య నియామకాలకు రష్యన్ కంపెనీలు కేంద్రంగా మారాయి. కాంట్రాక్ట్ సైనిక సేవ కోసం అభ్యర్థుల జాబితాలను రూపొందించే ప్రక్రియలో 150 కంటే ఎక్కువ మంది

-మిగతా 3 లో

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

- సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు
- కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



**తిరువనంతపురం,**

జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రంలోని

-మిగతా 3 లో

## రాజధాని పనుల వేగం పెంచాలి

**జాప్యం చేస్తున్న కాంట్రాక్టు సంస్థలపై సీఎం అసంతృప్తి**

- గ్రీన్ చానెల్ ద్వారా ఇసుక, గ్రావెల్ సరఫరా
- మొత్తం 20 వేల మంది కార్మికులు, నిపుణులు
- వారం, నెలవారీ టార్గెట్లతో పనిచేయండి
- అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి: చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదని తేల్చిచెప్పారు. శనివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో రాజధాని పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమావేశమయ్యారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ఆ మేరకు పనులు వేగంగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు కూడా పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులను ఓ కాంట్రాక్ట్ వర్క్‌గా భావించవద్దని, చరిత్రలో భాగస్వాములవుతున్నట్లు భావించాలని సూచించారు. నిర్మాణ సంస్థలుగా ఎన్నో ప్రాజెక్టులు చేసి

-మిగతా 3 లో







## సమీర్ రిజ్వీ విధ్వంసం..

- ముంబైని చిత్తుగా ఓడించిన ఢిల్లీ..!
- 6 వికెట్ల తేడాతో ముంబైపై గెలుపు
- వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

ఢిల్లీ జట్టును సమీర్ రిజ్వీ మరోసారి ఆదుకున్నాడు. మొదటి మ్యాచ్‌లో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 70 పరుగులు చేసి అజయంగా నిలిచి జట్టును గెలిపించిన రిజ్వీ.. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 90 (7 ఫోర్లు, 7 సిక్సులు) పరుగులు చేసి జట్టుకు రెండో విజయాన్ని అందించాడు. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఢిల్లీకి 163 పరుగుల టార్గెట్‌ను సెట్ చేసింది. 18.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను ఫినిష్ చేసింది ఢిల్లీ. ఛేజింగ్‌లో ఢిల్లీకి మొదట్లోనే పెద్ద షాక్ తగిలింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (1), నితీష్ రానా (0) తక్కువ పరుగులకే ఔట్ అయ్యారు. దీంతో రిజ్వీ,

-మిగతా 3 లో



## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- బావిలోకి దూసుకెళ్లిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి

**ముంబై,**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం

-మిగతా 3 లో



## అమెరికాకు చావు దెబ్బ!

- అయినా ఆడంబర ప్రకటనలు ఆపని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- పశ్చిమాసియా యుద్ధంలో అగ్ర రాజ్యానికి భారీ ఆర్థిక నష్టం
- ఒకే రోజు రెండు విమానాలు, రెండు హెలికాప్టర్ల కూల్చివేత
- గత 20 ఏండ్ల కాలంలో ఆ దేశానికి ఇదే భారీ ఎదురు దెబ్బ

3 లో


## పెట్రోల్ పై రూ.80 తగ్గింపు ... ఎక్కడంటే...



3 లో

## 28 జిల్లాలతో కొత్తగా ఏపీ మ్యాప్ విడుదల


**అమరావతి ప్రాంతానికి ప్రత్యేకంగా గుర్తింపు**




**అమరావతి, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ అధికారిక మ్యాప్‌ను ఈ నెల 2వ తేదీన ప్రచురించారు. ఇందులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. రాజధాని అమరావతి ప్రస్తావన, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా పొందుపరిచారు. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్ చేశారు. గుంటూరు, కృష్ణా,

-మిగతా 3 లో




## ఆ ఉద్యోగులను క్రమబద్ధీకరించాల్సిందే!

- తెలుగుగంగ, వీఎంసీ ఉద్యోగుల పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- 2 నెలల్లో రెగ్యులరైజ్ చేయాలన్న ధర్మాసనం
- కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న వారికి ఊరట

**అమరావతి, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో దశాబ్దాల తరబడి తక్కువ జీతంతో పనిచేయించుకుని క్రమబద్ధీకరణ నిరాకరించడం శ్రమ దోపిడీకి పాల్పడటమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. "రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకుండా తాత్కాలిక, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకోవడాన్ని అనేక సందర్భాల్లో మేం గమనిస్తున్నాం. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా

-మిగతా 3 లో

## కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ షురూ

**ప్రభుత్వ అరాచకాలపై ప్రజాస్వామ్య జయకేతనం**

- క్యాతనపల్లి విజయంలో మిత్రపక్షమైన సీపీఐ కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకం
- కేవలం రెండున్నరేండ్ల పాలనలోనే పీకల్లోతు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్
- క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీల్లో విజయంపై కేటీఆర్ హర్షం



**హైదరాబాద్ ,ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

కాంగ్రెస్ అరాచకాలను ఓడించి ప్రజాస్వామ్య జయకేతనం ఎగురవేశామని బీఆర్ఎస్ వర్కింగ్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తెలిపారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ చైర్మెన్ పీఠాలను గెలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న

-మిగతా 3 లో

## నిత్యావసరాల నౌకలకు అనుమతి



**టెహ్రాన్: ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
హెర్ముజ్ జల సంధి గుండా తమ దేశ ఓడరేవులకు నిత్యావసర వస్తువులను తీసుకువెళ్లే నౌకల రాకపోకలకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు శనివారం ఆ దేశ వార్తా సంస్థ తస్నిమ్ తెలిపింది. ప్రస్తుతం ఒమన్ గల్ఫ్‌లో ఉన్న నౌకలతో సహా ఇరాన్ ఓడరేవులకు వెళ్లే నౌకలు ఈ జలసంధి గుండా ప్రయాణించడానికి అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆ వార్తాసంస్థ తెలిపింది.ఇటీవల ప్రపంచవ్యాప్తంగా ఎదురైన ఒడిదుడుకుల నుంచి భారత్ దృఢంగా బయటపడిందని మన విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ ప్రతీకార చర్యలకు వ్యతిరేకంగా ఇటలీ అందిస్తున్న సహాయం గురించి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సౌదీ అరేబియా ప్రధాని సల్మాన్‌తో చర్చించారు.

## బీహార్‌లో కల్తీ మద్యం కాటు..

**ఐదుగురి మృతి**



**మోతిహారి ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
మద్యం నిషేధం అమల్లో ఉన్న బీహార్ రాష్ట్రంలో కల్తీ మద్యం మళ్లీ ప్రాణాలు తీసింది. తూర్పు చంపారన్ జిల్లాలోని మోతిహారి పరిసర ప్రాంతాల్లో కల్తీ మద్యం సేవించి ఐదుగురు మరణించారు. తుర్కౌలియా, రఘునాథ్‌పూర్ ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి 12 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా మేజిస్ట్రేట్ సౌరభ్ జోర్వాల్ తెలిపారు. మతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నిందితులపై హత్య కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఏడుగురు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని అధికారులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ స్వర్ణ్ ప్రభాత్ పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో మతులు కల్తీ మద్యం సేవించినట్లు తేలిందని తెలిపారు. మద్యం సరఫరాదారుడిని గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని త్వరలో అరెస్టు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా పోలీసులు, యాంటీ-లిక్కర్ టాస్క్ ఫోర్స్ (ఎఎల్టీఎఫ్) సంయుక్తంగా పర్సౌని, ముషహరి టోలా, తుర్కౌలియా ప్రాంతాల్లో సోదాలు కొనసాగిస్తున్నాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు తుర్కౌలియా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను సస్పెండ్ చేశారు. ఈ ఘటన బీహార్ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వ మద్యపాన నిషేధ విధానం ఒక బూటకమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

## హిందీ రాష్ట్రాల విద్యార్థులు.. దక్షిణాది భాషలు నేర్చుకుంటారా?

**కేంద్రం తీరుపై మండిపడ్డ సీఎం స్టాలిన్**



**చెన్నై, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
కేంద్ర సర్కార్‌పైన, సీబీఎస్ఈపైన తమిళనాడు సీఎం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లోని విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం వంటి దక్షిణాది భాషలను తప్పనిసరిగా నేర్చుకుంటారా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. భాషల గురించి రాష్ట్రాలకు కేంద్రం నీతులు చెప్పడం ద్వంద్వ నీతికి పరాకాష్ఠగా ఆయన ఎద్దేవా చేశారు. త్రిభాషా విధానం వల్ల హిందీ మాట్లాడే విద్యార్థులకే ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ప్రయోజనం చేకూరుతున్నదని, రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయని స్టాలిన్ హెచ్చరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, యానిమేషన్, గేమింగ్ వంటి ఆధునిక రంగాల్లో విద్యార్థులకు నైపుణ్యాలు అందించాల్సిన ఈ తరుణంలో వారిపై అదనపు భాషా భారాన్ని మోపటం సరికాదని అన్నారు.రాష్ట్రాల ఆందోళనలను కేంద్రం పట్టించుకోకపోవటం సమాఖ్య స్ఫూర్తికి, కోట్ల మంది భాషా గుర్తింపునకు జరిగిన అవమానమని స్టాలిన్ వ్యాఖ్యానించారు. దేశంలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని అమలుజేయాలన్న ప్రతిపాదనపై ఆయన విమర్శలు గుప్పించారు. ఇది రాజకీయ ప్రేరేపిత చర్య అని, దేశంలో భాషా వైవిధ్యానికి తూట్లు పొడిచే ప్రయత్నమని మండిపడ్డారు. ఇది సాధారణ విద్యా సంస్కరణ కాదని, భారతీయ భాషలను ప్రోత్సహిస్తున్నామనే ముసుగులో హిందీని రుద్దేందుకు జరుగుతున్న ఆందోళనకర ప్రయత్నమిదని విమర్శించారు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇతర ప్రాంతీయ భాషలను పక్కనపెట్టి హిందీకి అగ్రస్థానం కల్పిస్తున్నదని ఆరోపించారు. భాషా విధానం పేరుతో హిందీయేతర రాష్ట్రాల్లో హిందీని విస్తరించాలని చూస్తున్నారని, దక్షిణాది విద్యార్థులకు ఇది బలవంతంగా హిందీని నేర్పడమే తప్ప మరొకటి కాదని అన్నారు.

# రాహుల్ గాంధీకి సీనియర్ల షాక్


**-పశ్చిమాసియా యుద్ధంలో కేంద్రం దౌత్య**
**-విధానానికి కాంగ్రెస్ నేతల ప్రశంసలు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
పశ్చిమాసియా యుద్ధం, దేశంలో గ్యాస్ సిలిండర్ల కొరతపై మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి ఆ పార్టీ సీనియర్లు షాక్ ఇచ్చారు. యుద్ధం విషయంలో వారు రాహుల్‌తో విభేదించడమే ఇందుకు కారణం. దీంతో హస్తం పార్టీ తీరుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తున్నది. విదేశాంగ విధానంలో ప్రధాని రాజీ పడ్డారని రాహుల్ ఇటీవల విమర్శించారు. అయితే దీనికి విరుద్ధంగా 'విదేశాంగ విధానంలో కేంద్రం బాధ్యతాయుతంగా రాజనీతిని ప్రదర్శించిందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఇటీవల ట్వీట్ చేశారు.మరోవైపు యుద్ధ ప్రభావం మన దేశంపై పడి సంక్షోభంగా మారకముందే కేంద్రం పరిణితి కలిగిన ఆలోచన, నైపుణ్యంతో పని చేస్తున్నదని మరో సీనియర్ నేత ఆనంద్ శర్మ మోదీ సర్కారును ప్రశంసించారు. దేశంలో ఎల్పీజీ, పెట్రో ఇంధనాలకు కొరత లేదని.. ప్రజల్లో ఏర్పడిన భయాందోళన వల్లే సరఫరాలో ఆలస్యమవుతున్నదని మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ అభిప్రాయపడ్డారు. యుద్ధం విషయంలో కేంద్రం సరైన నిర్ణయాలను తీసుకుంటున్నదని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై బీజేపీ వ్యంగ్యంగా స్పందించింది. 'దేశంలో ఇంధన కొరత లేదని విపక్షంలోని సీనియర్ నాయకులే అంగీకరించారు. కానీ కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం ఇంధనం విషయాన్ని రాజకీయం చేస్తూ ప్రజల్లో భయాన్ని కలిగిస్తున్నది' అని జ్యోతిరాదిత్య సింధియా వ్యాఖ్యానించారు.

# వాటిని నమ్ముకుంటే గుండెకు రిస్కే..

**-భారతీయులపై పరిశోధనలో వెల్లడి**
**-హృద్రోగ ప్రమాద అంచనాలో రిస్క్ కాలిక్యులేటర్ల విఫలం!**



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
గుండె జబ్బుల ప్రమాదాన్ని అంచనా వేయడానికి విస్తృతంగా ఉపయోగించే రిస్క్ కాలిక్యులేటర్లు భారతీయుల అనారోగ్య వాస్తవ ప్రమాద స్థాయిని గుర్తించడంతో పెద్ద సంఖ్యలో విఫలమవుతున్నాయని కొత్త పరిశోధన తెలిపింది. గుండెపోటు వచ్చిన రోగుల్లో సుమారు 80 శాతం మందిని ముందుగానే 'హై రిస్క్ కేటగిరీగా గుర్తించడంలో ఇవి విఫలమైనట్టు ఈ అధ్యయం వెల్లడించింది.గోవింద్ వల్లభ్ పంత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి, ఫరీదాబాద్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ, ఎయిమ్స్‌లోని ఢిల్లీ కేన్సర్ రిజిస్ట్రీ శాస్త్రజ్ఞులు ఈ పరిశోధన నిర్వహించారు. తొలిసారిగా గుండెపోటు వచ్చిన 4,975 మంది రోగులపై పరిశోధన నిర్వహించి ఐదు హృద్రోగాల నిర్ధారణలో ప్రపంచ ప్రమాద అంచనా నమూనాల ప్రకారం వ్యక్తులను వర్గీకరించే విధానంలో గణనీయమైన తేడాలున్నట్టు గుర్తించారు. డబ్ల్యూహెచ్ రిస్క్ చార్టుల వంటి టూల్స్ కొన్ని తొలిసారి గుండెపోటును వచ్చిన వారిలో ఇవి ప్రమాదాన్ని పూర్తిగా గుర్తించలేక పోయాయి. వీటిలో కొన్ని మోడల్స్ 20 శాతం మందిని మాత్రమై హై రిస్క్ కింద గుర్తించగా, మిగిలినవి దారిదాపుల్లో కూడా ఆ విషయాన్ని నిర్ధారించలేక పోయాయి. ఏఎస్‌సీవీడీ 2013 మోడల్ అయితే 12.3 శాతం మాత్రమే రిస్క్ ఉన్నట్టు తెలిపింది. మొత్తం మీద మెజారిటీ మోడల్స్ ఒక మాదిరి రిస్క్ కేటగిరీలోనే వారిని ఉంచినట్టు పరిశోధన గుర్తించింది. మొత్తం మీద ఈ పాశ్చాత్య మోడల్స్‌ను అనుకరించడం వల్ల భారతీయుల గుండెపోటు ప్రమాద స్థాయిని ముందుగా గుర్తించలేక పోతున్నారని ఈ నివేదిక పేర్కొంది. ఒక వ్యక్తికి భవిష్యత్తులో గుండె సమస్యలు వచ్చే అవకాశాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే గణిత మోడల్స్ లేదా టూల్స్‌నే రిస్క్ కాలిక్యులేటర్లు అంటారు.

## 48 గంటలే.. త్వరగా తేల్చండి..

**ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
పశ్చిమాసియా దేశమైన ఇరాన్‌పై భీకర దాడులు చేయడానికి సమయం మించిపోతున్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం హెచ్చరించారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి లేదా హెర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చిన విషయం గుర్తుందా అని ఆయన ట్రూత్ సోషల్ పోస్టులో ప్రశ్నించారు.సమయం మించిపోతున్నది. ఇరాన్‌పై ప్రళయం విరుచుకు పడడానికి 48 గంటల సమయం మాత్రమే ఉంది అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. శుక్రవారం ఇరాన్ వైమానిక దళాలు రెండు అమెరికా యుద్ధ విమానాలను కూల్చివేసిన తర్వాత ట్రంప్ ఈ హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ అభ్యర్థన మేరకు ఆ దేశ ఇంధన మౌలిక సదుపాయాలపై ఏప్రిల్ 6 వరకు దాడుల చేయమని అమెరికా పేర్కొంది.

## కేరళలో అధికారంలోకి వస్తాం

**ప్రధాని నరేంద్ర మోడీ**



**తిరువంతనపురం ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
కేరళలో బిజెపి నేతృత్వంలోని ఎల్‌డిఎ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పతనంతిట్ట జిల్లాలోని తిరువల్లలో శుక్రవారం నాడు నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కేరళ అభివద్ధికి అవినీతి, మతతత్వం రెండు అతిపెద్ద అవరోధాలని చెప్పారు. శబరి రైలు ప్రాజెక్టును ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో తిరువల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. కేరళకు అపారమైన సామర్థ్యం ఉన్నప్పటికీ, అభివద్ధి పరుగులో ఇతర రాష్ట్రాల కంటే వెనుకబడి ఉందని పేర్కొన్నారు. అయితే కేంద్ర నిధుల మంజూరులో తీవ్ర వివక్ష చూపి వేధింపులకు గురిచేసిన ఆయనే..ఇక్కడే ప్రాజెక్టుల పురోగతిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని సభకు హాజరైన బిజెపి కార్యాకర్తలే వ్యాఖ్యానించడం కనిపించింది. కేరళలో బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. పశ్చిమాసియాలో పరిస్థితిపై కాంగ్రెస్ అనవసర ఆందోళనలు రేకెత్తిస్తోందని ప్రధాని విమర్శించారు. 'నేను ఇంతకు ముందు కూడా ఇక్కడికి వచ్చాను. కానీ ఈసారి మార్పు గాలులు మరో దిశలో వీస్తున్నాయి. కేరళ ప్రజల మూడ్ మారినట్టు కనిపిస్తోంది. కేరళలో అతిపెద్ద మార్పు జరగబోతోంది. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగుతుంది. కేరళలో మొదటి సారిగా బిజెపి నేతృత్వ కూటమి అధికారంలోకి రాబోతోంది' అని ఆయన చెప్పారు.

# లక్నోలో పేలుళ్లకు కుట్ర..

**నలుగురు ఉగ్రవాదులను అరెస్టు చేసిన ఏటీఎస్**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నిన నలుగురు ఉగ్రవాదుల ముఠాను ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేసింది. ఏటీఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరికి పాకిస్తాన్ ఉగ్రవాద ముఠాలతో సంబంధం ఉంది. వీరిలో మీరట్‌కు చెందిన సాకిబ్ అలియాస్ డెవిల్ ప్రధాన నిందితుడు. సాకిబ్‌తోపాటు అతడి అనుచరులు లక్నోతోపాటు దేశంలో పలు ఉగ్రవాద, జాతి వ్యతిరేక కార్యకలాపాలకు ప్లాన్ చేశారు. వీరు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ యాప్స్ ద్వారా పాకిస్తాన్ ఉగ్రముఠాలతో సంప్రదింపులు జరిపేవారు. ఈ నలుగురు ఉగ్రవాదుల ముఠా దేశంలో భారీ విధ్వంసానికి ప్లాన్ చేసింది. రైల్వే సిగ్నల్ బాక్స్‌ల ద్వారా రైళ్లను ఆపి భారీగా దాడులు చేయడం, ప్రముఖ సంస్థలు, సిలిండర్ గ్యాస్ తీసుకెళ్లే ట్రక్కులు, ప్రభుత్వం సంస్థలు, కీలక ప్రదేశాల్ని వీరు లక్ష్యంగా ఎంచుకున్నారు. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు పంపిన గూగుల్ ఫొటోస్, లొకేషన్స్ ఆధారంగా.. ఇక్కడి కొందరు రాజకీయ నేతలు, ప్రముఖ సంస్థలపై నిఘా పెట్టి, వాటి సమాచారాన్ని సేకరించారు. ఈ సమాచారాన్ని పాకిస్తాన్ చేరవేశారు. ఘజియాబాద్, అలీఘడ్, లక్నోలో రైల్వే స్టేషన్ వంటి పలు ప్రాంతాల్ని సర్వే చేశారు. అలాగే, ఇక్కడ కొన్ని చిన్న చిన్న విధ్వంసాలకు పాల్పడి, వాటిని వీడియో తీసి, ఆ వీడియోల్ని పాకిస్తాన్ పంపించారు. ఇవన్నీ చేసినందుకుగాను, క్యూఆర్ కోడ్ల ద్వారా కొన్ని సంస్థల నుంచి నిధులు అందుకున్నారు. సోషల్ మీడియాను వాడి పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రమూకలు, ఇండియాలోని యువతను తీవ్రవాదం వైపు నడిపిస్తున్నారు. లక్నోలో పట్టుబడ్డ ముఠా ఏప్రిల్ 2న లక్నో రైల్వే స్టేషన్ సమీపంలో పేలుళ్లకు కుట్ర పన్నారు.అలాగే, రైల్వే ఆస్తుల్ని, ట్రాకులు, సిగ్నల్ వ్యవస్థను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. అయితే, సరైన సమయంలో ఏటీఎస్ స్పందించి ఉగ్రవాద నిందితుల్ని అరెస్టు చేసింది. నిందితులు సాకిబ్, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్, లోకేష్ అలియాస్ పాప్లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్‌గా గుర్తించారు. వీరి దగ్గరి నుంచి కొన్ని పేలుడు పదార్థాలు, ఏడు సెల్‌ఫోన్లు వంటివి స్వాధీనం చేసుకున్నారు. దేశంలో భయోత్పాతం సృష్టించడానికి నిందితులు ప్రయత్నిస్తున్నట్లు ఏటీఎస్ అధికారులు తెలిపారు.

# పాక్‌కు షాకిచ్చిన యూఏఈ..

మొదటి తరువాయి

తీర్చేయబోతుంది.ప్రస్తుతం ఇరాన్ యుద్ధం కారణంగా యూఏఈ కూడా ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటుంది. దీంతో తమ బాకీ చెల్లించాలని పాక్‌ను కోరింది. దీనికి పాకిస్తాన్ కూడా అంగీకరించింది. ఈ నెల 11న 450 మిలియన్ డాలర్లు, 17న 2 బిలియన్ డాలర్లు, 23న బిలియన్ డాలర్లను పాక్ చెల్లించేందుకు అంగీకరించింది. సెంట్రల్ బ్యాంకుకు చెందిన 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వల నుంచి ఈ నిధులను పాక్ చెల్లించబోతుంది. ఈ అప్పుల్లో మూడు దశాబ్దాల నాటి అప్పు కూడా ఉండటం విశేషం. 1996-97లో పాకిస్తాన్ 450 మిలియన్ డాలర్లను అప్పుగా తీసుకుంది. అప్పట్లో ఒక సంవత్సర కాల పరిమితితో ఈ అప్పు తీసుకుంది. అయితే, ఇంతవరకు చెల్లించలేదు. ఈసారి మాత్రం చెల్లించబోతుంది. నిజానికి పాకిస్తాన్‌కు ఇచ్చిన అప్పు కాల పరిమితిని పొడిగించాలని ఇటీవల యూఏఈ నిర్ణయించింది. దీనిపై ఇంకా సంప్రదింపులు జరుగుతున్నాయి. కానీ, ఈలోగానే ఇరాన్ యుద్ధం ప్రారంభమవ్వడంతో యూఏఈ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. డబ్బులు చెల్లించాలని పాక్‌ను కోరింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్తాన్‌కు యూఏఈ సహా అమెరికా, చైనా, సౌదీ అరేబియా వంటి దేశాలు సహాయం అందిస్తున్నాయి. ఐఎంఎఫ్ నుంచి పాకిస్తాన్‌కు నిధులు అందేలా చూస్తున్నాయి. ఆయ దేశాలు కూడా అప్పులు ఇస్తున్నాయి.

## సైన్యం కోసం కంపెనీల బాటకు రష్యా!

మొదటి తరువాయి

ఉద్యోగులు ఉన్న సంస్థలను రష్యా అన్వేషించడం ప్రారంభించింది. ర్యాజాన్ ప్రాంతంలో ప్రైవేట్, ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీలు ఉద్యోగులను నామినేట్ చేయాలని ఆదేశిస్తూ అక్కడి గవర్నర్ పావెల్ మల్కోవ్ ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ ఉత్తర్వు ప్రకారం అవసరమైన అభ్యర్థుల సంఖ్య కంపెనీ పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. 150 నుండి 300 మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలు కనీసం ఇద్దరు అభ్యర్థులను, 300 నుండి 500 మంది ఉన్న కంపెనీలు ముగ్గురు అభ్యర్థులను, 500 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలు ఐదుగురు అభ్యర్థులను నామినేట్ చేయాలని ఆయన ఆదేశించారు. వాస్తవానికి ఇది యజమానులపై ఒక కొత్త రకమైన ఒత్తిడిని సృష్టించనున్నది. దీనికి కారణం వారు కూడా ఇప్పుడు నియామక వ్యవస్థలో భాగం కావడం. ఇది అధికారిక ప్రకటన లేకుండా రహస్యంగా సమీకరణ జరిపేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది. రష్యా అధికారికంగా మరో విడత సైన్య సమీకరణను ప్రకటించనప్పటికీ అధికారులు సైన్యాన్ని తిరిగి నింపడానికి ప్రత్యామ్నాయ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. వీటిలో ఆర్థిక ప్రోత్సాహకాలు, ఖైదీలను నియమించుకోవడం, విదేశీ నియామకాలు, ఇప్పుడు వ్యాపార సంస్థల ద్వారా ఒత్తిడి తేవడం వంటివి ఉన్నాయి. ఈ కొత్త విధానంతో స్వచ్ఛంద సేవకు క్రమంగా మంగళం పాడుతున్నట్లు అర్థమవుతున్నది. ఈ ఉత్తర్వులో తమ ఆదేశాలను పాటించని కంపెనీలపై విధించే శిక్షలను స్పష్టంగా పేర్కొనలేదు. కాని ప్రభుత్వ ఆదేశాలను అడ్డుకునే కంపెనీలకు ప్రస్తుత చట్టం ప్రకారం 10 లక్షల రూబుల్స్(12,300 డాలర్లు) వరకు జరిమానాలు విధించవచ్చు. ర్యాజాన్ ప్రాంత గవర్నర్ పావెల్ మల్కోవ్ సంతకం చేసిన ఈ ఆదేశం ప్రకారం యాజమాన్య స్వరూపంతో సంబంధం లేకుండా సంస్థలు సెప్టెంబర్ 20 లోగా నియామకాల కోటాలను నిర్ధారించాలని నిర్దేశిస్తున్నది.

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

మొదటి తరువాయి

యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

మొదటి తరువాయి

రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

## 28 జిల్లాలతో కొత్తగా ఏపీ మ్యాప్ విడుదల

ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని 'రాష్ట్ర రాజధాని' గా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేక బౌండరీలను కేటాయించకుండానే, ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని.. రాష్ట్ర రాజధానిగా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు.. గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా.. ఇటీవల మార్కాపురం, పోలవరం అనే రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు జిల్లాల సరిహద్దులను కూడా తాజా మ్యాప్‌లో తెలియజేశారు. దీంతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వాహణ శాఖ ఈ మ్యాప్‌ను విడుదల చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం.. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో జిల్లాల వారీగా సహాయక చర్యలు చేపట్టడానికి స్పష్టమైన భౌగోళిక సమాచారం ఉండటమే. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధతను ఈ మ్యాప్ తొలగించనుంది.

# సమీర్ రిజ్వీ విధ్వంసం..

మొదటి తరువాయి

నిస్సంకా 44 (6 ఫోర్లు, 1 సిక్స్) స్కోర్ బోర్డును పరుగులు పెట్టించే బాధ్యతను తమపై వేసుకున్నారు. వీరిద్దరు కలిసి 67 పరుగుల పార్ట్‌నర్‌షిప్ నెలకొల్పారు. నిస్సంకా ఔట్ అయిన తర్వాత.. రిజ్వి మరింత దూకుడుగా ఆడాడు. దీంతో ఓడిపోతుందా అనే సందేహం నుంచి ఈజీగా చేజింగ్ చేసే దిశకు రిజ్వి మ్యాచ్‌ను మలుపుతిప్పేశాడు. ముంబై బౌలర్లలో సాంట్నర్, కార్బన్ బాష్, దీపక్ చాహర్ చెరో వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ 51 (3 ఫోర్లు, 2 సిక్సులు), రోహిత్ శర్మ 35 (5 ఫోర్లు, 1 సిక్సు) మినహా మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. యువ పేసర్ ముఖేష్ కుమార్ ఆరంభంలోనే ర్యాన్ రిక్కల్టన్ (9), తిలక్ వర్మ (0) వికెట్లను పడగొట్టాడు. ఆ తర్వాత రోహిత్ శర్మతో కలిసి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జట్టు స్కోర్ బోర్డును పరుగులు పెట్టించే ప్రయత్నం చేశారు. కానీ అక్షర్ పటేల్ వీరిద్దరి పార్ట్‌నర్‌షిప్‌కు బ్రేక్ వేశాడు. రోహిత్‌ను 10వ ఓవర్‌లో పెవిలియన్‌కు పంపాడు. ఈ పిచ్ పై పటిష్టమైన ముంబై ఇండియన్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి కేవలం 162 పరుగులు మాత్రమే చేసింది. ఢిల్లీ బౌలర్లు మొదట్నుంచీ కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ తో బౌలింగ్ చేశారు. క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ముంబై ఇండియన్స్ బ్యాటర్లు భారీ స్కోరు చేయకుండా అడ్డుకోవడంలో సక్సెస్ అయ్యారు. ముంబై ఇండియన్స్ తరఫున కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ హాఫ్ సెంచరీ సాధించాడు. సూర్య 36 బంతుల్లో 51 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్ లో 3 ఫోర్లు, రెండు సిక్సర్లు వచ్చాయి. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 26 బంతుల్లో 35 పరుగులు చేశాడు. ఢిల్లీ జట్టు ఐదుగురు బౌలర్లు వికెట్లు తీశారు. 18 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో మరో ఓపెనర్ రోహిత్ శర్మకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జత కలిశాడు. వీరిద్దరూ ఆచితూచి ఆడుతూ చెత్త బంతులను బౌండరీలకు తరలించారు. వీరిద్దరి మధ్య 53 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. రోహిత్ శర్మ 26 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 35 పరుగులు చేశాక అక్షర్ పటేల్ బౌలింగ్ లో ఔటయ్యాడు. మరోవైపు సూర్యకుమార్ 36 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 51 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. లుంగి ఎంగిడి బౌలింగ్ లో వికెట్ల ముందు దొరికిపోయాడు.

# రాజధాని పనుల వేగం పెంచాలి


మొదటి తరువాయి



ఉంటారని, కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదన్నారు. ప్రస్తుతం రూ.57,821 కోట్ల విలువైన పనులుండగా...వాటిలో రూ.50,943 కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం 20 వేల మంది కార్మికులు, నిపుణులు పనిచేస్తున్నారని తెలిపారు. ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది.. లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకున్నారని పనుల వారీగా సీఎం చర్చించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరు పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేయగా.. మ్యాన్‌పవర్ విషయంలో కొన్ని ఇబ్బందులున్నాయని కాంట్రాక్టర్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా చాలా మంది కార్మికులు స్వస్థలాలకు వెళ్లారని చెప్పగా.. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్‌పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఎంత మెషినరీని వినియోగిస్తున్నారని కూడా సీఎం ఆరా తీశారు. 5580 మెషినరీ అవసరముండగా, ప్రస్తుతం 3767 మెషినరీ ఉందని, ఇవి కాకుండా 16 హాట్‌మిక్స్, 36 వెట్‌మిక్స్, 34 ఆర్ఎంసీ మెషిన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. వారం, నెలవారీగా టార్గెట్‌లు పెట్టుకుని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వారానికి రూ.941 కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశముందని, ఈ లోగానే చేపట్టాల్సిన పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కువ ప్రాజెక్టులు చేపడుతున్న నిర్మాణ సంస్థలు మరింతగా దృష్టిని కేంద్రీకరించి పనులు చేయాలన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని సీఎం స్పష్టం చేశారు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలన్నారు. నాణ్యత ఉండాలని, కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలని, గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీ వంటివి వినియోగించుకోవాలని నిర్దేశించారు. రాజధాని ప్రతిష్ఠను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చన్నారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యమెందుకు?రాజధాని ప్రాంతంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలను సీఎం ప్రస్తావించారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్లనే ప్రభుత్వంపై విమర్శలొస్తున్నాయన్నారు. ఘటన జరిగిన తర్వాత కాంట్రాక్టు సంస్థలు గానీ, అధికారులు గానీ తగిన రీతిలో స్పందించలేదంటూ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అంశాన్ని వక్రీకరించేలా కొందరు రాజకీయం చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జరగరాని ఘటనలు జరిగితే వెంటనే అలెర్ట్ చేయాలని ఆదేశించారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా..ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు, బురద చల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నిర్మాణ సంస్థలు సమర్థులను ప్రాజెక్టు మేనేజర్లుగా నియమించుకోవాలని సూచించారు.

# అమెరికాకు చావు దెబ్బ!..

- -అయినా ఆడంబర ప్రకటనలు ఆపని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- -పశ్చిమాసియా యుద్ధంలో అగ్ర రాజ్యానికి భారీ ఆర్థిక నష్టం
- -ఒకే రోజు రెండు విమానాలు, రెండు హెలికాప్టర్ల కూల్చివేత
- -గత 20 ఏండ్ల కాలంలో ఆ దేశానికి ఇదే భారీ ఎదురు దెబ్బ



వాషింగ్టన్:
ఎన్నో యుద్ధాలు చేసిన అనుభవం ఉన్న అగ్ర రాజ్యం అమెరికాకు ఇరాన్‌తో జరిగిన పశ్చిమాసియా యుద్ధంలో మాత్రం చావు దెబ్బ తగిలింది! ప్రాణ నష్టం పెద్దగా లేకపోయినప్పటికీ, ఆ దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అతి పెద్ద ఆర్థిక, ఆయు ధ నష్టం సంభవించింది. ఈ యుద్ధంలో ఆరేడు శక్తిమంతమైన విమానాలు, రాడార్లను కోల్పోయిన అమెరికాడ శుక్రవారం తాజాగా మరో రెండు యుద్ధ విమానాలను కోల్పోయింది. అలాగే ఆ దేశానికి చెందిన రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లను ఇరాన్ కూల్చివేసింది. అమెరికా విమాన వాహక నౌకకు కూడా నష్టం కలిగించింది. మొత్తం మీద అమెరికాకు రూ.వేల కోట్ల నష్టం ఏర్పడింది. అసలు ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా చేసిన వ్యూహరచన పూర్తిగా విఫలమైందని యుద్ధ నిపుణులు అంటున్నారు. ఎప్పుడూ ఇరాన్ పాలనను మార్చుదామనే అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది తప్ప, హొర్ముజ్ జల సంధిని ఇరాన్ ఆధీనంలోకి తీసుకొంటుందని, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తుందని యూఎస్ అస్సలు ఊహించలేదని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇజ్రాయెల్ ఒత్తిడితో యుద్ధంలోకి ఆదరా బాదరాగా అడుగుపెట్టిన అమెరికాకు ఇప్పుడు యుద్ధం నుంచి బయటపడే 'ఎగ్జిట్ ప్లాన్' లేక ఎంగిలిలో పడ్డ ఈగలా గిలగిలా కొట్టుకుంటున్నది. అయినప్పటికీ ఆడంబర ప్రకటనలు చేస్తూ తన బెదిరింపులతో శత్రు దేశానికి లొంగదీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 'ఇరాన్‌ను అమెరికా ఓడించి పూర్తిగా నాశనం చేసింది. పనిని పూర్తి చేయబోతున్నాం. ఈ పనిని మేం అత్యంత వేగంగా ముగించబోతున్నాం' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన రెండు రోజులకే అగ్రరాజ్యానికి భారీ దెబ్బ తగలడం విశేషం.

ఇది యుద్ధం: ట్రంప్

తమ విమానం కూల్చివేత, సెర్చ్ ఆపరేషన్ గురించి చర్చించడానికి వ్యాఖ్యానించడానికి అమెరికా అధ్యక్షుడు తిరస్కరించారు. ఎన్‌బీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ జరిగిన ఘటనలు ఇరాన్‌తో చర్చలకు ఆటంకం కావని అంటూ 'ఇది యుద్ధం' అని వ్యాఖ్యానించారు. మరోవైపు యూఎస్‌కు చెందిన ఏ-10 విమానాన్ని పర్షియన్ గల్ఫ్‌లో తమ రక్షణ దళాలు కూల్చివేశాయని ఇరాన్ ప్రకటించింది. అయితే ఈ విమానం కూలిపోయిందా, లేక కూల్చివేశారా అన్న విషయంపై స్పష్టత లేదని పేరు తెలపడానికి ఇష్టపడని ఒక యూఎస్ అధికారి పేర్కొన్నారు. అలాగే అది ఎక్కడ కూలింది, అందులోని సిబ్బంది పరిస్థితిపై కూడా సమాచారం లేదని అన్నారు. కాగా, ఒక వైపు ఇరాన్ నావిక, వైమానిక దళాలను పూర్తిగా ధ్వంసం చేసామంటూ అగ్రరాజ్యం ప్రకటిస్తుండగా శుక్రవారం ఇరాన్ అటు అమెరికా విమానాలపై ఇటు గల్ఫ్‌లోని చమురు శుద్ధి క్షేత్రంపై దాడులు చేయడమే కాక, ఇజ్రాయెల్‌లోని మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌ను ధ్వం సం చేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది.

## ఆ ఉద్యోగులను క్రమబద్ధీకరించాల్సిందే!




వీరితో పూర్తికాలం పనిచేయించుకుంటూ రోజువారీ వేతన జీవులుగా ఉంచడం అన్యాయం. తమ సేవలను క్రమబద్ధీకరించాలని ఆ ఉద్యోగులు కోరినప్పుడల్లా అధికారులు సాకులు చెబుతున్నారు. ఈ వైఖరి సరికాదు. వారి వినతిని పరిశీలించేటప్పుడు ప్రభుత్వం ఆదర్శ యజమానిగా వ్యవహరించాలి. తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్, టైపిస్టు తదితర కేడర్లలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న పిటిషనర్లు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ)లో టైపిస్టులు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఆఫీసు సబార్డినేట్లు, ట్రేసర్లు, వాచ్‌మెన్‌లు, డ్రైవర్లు తదితర సర్వీసులను 2నెలల్లో క్రమబద్ధీకరించాలి." అని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిటిషనర్ల సర్వీసును క్రమబద్ధీకరించడానికి నిరాకరిస్తూ ఏపీ పరిపాలన ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దుచేసింది. తీర్పుకాపీ అందిన నాటి నుంచి రెండు నెలల్లో పిటిషనర్ల సేవలను క్రమబద్ధీకరించాలని, వారికి అన్ని అనుబంధ ప్రయోజనాలను అందించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సుబేంధుసామంతతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

## కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ షురూ

మొదటి తరువాయి

అరాచకాలను ఎదిరించి, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సాధించిన ఘనవిజయాన్ని "ప్రజాస్వామ్య జయకేతనం"గా అభివర్ణించారు. ఆ మున్సిపాల్టీల చైర్మెన్, వైస్ చైర్మెన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ (బంటి)తోపాటు, పార్టీ శ్రేణులకు ప్రత్యేక అభినందనలు ప్రకటించారు. అడ్డదారుల్లో మున్సిపాల్టీలను దక్కించుకోవడానికి కాంగ్రెస్ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఒత్తిళ్లు తెచ్చినా వేటికీ లొంగకుండా, మొక్కవోని దీక్షతో ఒక్క తాటిపై నిలిచిన కౌన్సిలర్ల ధైర్యానికి ఆయన సెల్యూట్ చేశారు. క్యాతనపల్లి విజయంలో మిత్రపక్షమైన సీపీఐ కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. రాష్ట్రంలో అణచివేతకు, బెదిరింపులకు, అవినీతి అక్రమాలకు తావులేదని ఈ ఎన్నికల తీర్పు స్పష్టంగా తేల్చి చెప్పిందని విమర్శించారు. కేవలం రెండున్నరేండ్ల పాలనలోనే పీకల్లోతు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్‌డౌన్ మొదలైందనీ, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల ఫలితాలు చాటిచెప్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించిన గులాబీ జెండా సైనికులను పార్టీ ఎప్పటికీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విజయాలు అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అడుగడుగునా విధ్వంసం చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారుకు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

## పెట్రోల్ పై రూ.80 తగ్గింపు ... ఎక్కడంటే...

న్యూఢిల్లీ,
పశ్చిమాసియా ఘర్షణలు పలు దేశాల్లో ఇంధన సంక్షోభానికి దారితీస్తున్నాయి. దాంతో ఆయా దేశాలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెంచుతుండటంతో సామాన్యులపై భారం పడుతోంది. ఇప్పటికే ఆర్థిక సమస్యలతో సతమతమవుతోన్న పాకిస్థాన్.. చమురు ధరలు పెంచి విమర్శల పాలైంది. దాంతో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ధరను 80 పాకిస్థానీ రూపాయలు తగ్గిస్తూ రాత్రికి రాత్రే షరీఫ్ ప్రకటన చేయాల్సి వచ్చింది.

# సంపాదకీయం

## ట్రా'ఫికర్'



హైదరాబాద్ అంటే ఒకప్పుడు చారిత్రక వైభవం గుర్తొచ్చేది. దాని ఆనవాళ్లయిన పురాతన కట్టడాలు, సంస్కృతి మనసును పులకరింపజేసేవి. కానీ, నేడు 'ట్రాఫిక్ జాం' నగరానికి పర్యాయపదంగా మారిపోయింది. ఉదయం ఆఫీస్‌కు వెళ్లేందుకు బయట అడుగుపెట్టిన నగరవాసికి ప్రతిరోజూ చిన్నపాటి సర్కస్ తప్పదు. గూగుల్ మ్యాప్ చెప్పే నలభై నిమిషాల సమయం వాస్తవ జీవితంలో గంటన్నరకు పైగా సాగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి మొదలుకుంటే సామాన్య కూలీ వరకు ప్రతిఒక్కరూ రోజుకు సగటున రెండుమూడు గంటల అమూల్యమైన సమయం రోడ్లపైనే వదిలేస్తున్న పరిస్థితి. అభివృద్ధి అంటే కాంక్రిట్ గోడలు, అద్దాల మేడలు నిర్మించడమే కాదు, పౌరుడి ప్రయాణం సాఫీగా సాగడం కూడా. ప్రస్తుతం ఇంటినుంచి ఆఫీస్ దూరం కంటే, ట్రాఫిక్‌లో గడిపే సమయమే పెద్దసమస్యగా మారింది. రోడ్లపై ప్రయాణించాలంటేనే జంకుతున్న దుస్థితి నెలకొంది. గమ్యం చేరడానికి గంటల తరబడి రోడ్లపై వేచిచూడటం పౌరుల సగటు జీవనప్రమాణాలను కూడా దెబ్బతిస్తోంది. ఏదైనా అత్యవసరమైతే ఎలా వెళ్లాలన్న ఆలోచనే మనిషిని భయాందోళనలో పడేస్తోంది. ఇది కేవలం రోడ్లపై కాదు, ఆరోగ్యంపై, మనసుపై, ఆర్థిక వ్యవస్థపై కూడా తన ముద్ర వేస్తోంది. హైదరాబాద్ అంటే దేశానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునేలా చేస్తామనే పాలకవర్గాల వాగ్దానాలకు కొదవలేదు. ఒకరేమో ఆకాశహర్మ్యాలు నిర్మించి సింగపూర్‌లా మారుస్తామన్నారు. మరొకరు ఫ్యూచర్‌సిటీ కలలు కంటున్నారు. ఆలోచన మంచిదే, ఆచరణలో పెట్టడమే కష్టం! ఎందుకంటే, ట్రాఫిక్ స్తంభనకు పాలకుల వైఫల్యమే కారణం. రాజధానికి ఉద్యోగ, ఉపాధి కోసం వలసలు పెరిగిన నేపథ్యంలో వాహనాల సంఖ్య కూడా అంతే రెట్టింప వుతోంది. 2010లో సుమారు 35 లక్షల వాహనాలు రోడ్లపై తిరిగేవి. కానీ, నేడు ఆ సంఖ్య కోటి ఐదు లక్షలు దాటడం ఆశ్చర్యకరం. పదిహేనేళ్ల వ్యవధిలోనే వాహనాలు మూడింతలు పెరిగాయి. మరి రహదారులు విస్తరిం చబడ్డాయా? అంటే లేదనే చెప్పాలి. వాహనాలు పెరిగిన వేగంతో పోలిస్తే, రోడ్ల వెడల్పు, కొత్త ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగానే సాగుతోంది. ప్రజలు ప్రతిరోజూ గంటల తరబడి ట్రాఫిక్‌లో గడపాల్సి వస్తోంది. టైంకు చేరుకోవాలన్న ఆతృతలో కుటుంబంతో, పిల్లలతో గడిపే సమయం కూడా లేకుండా పోతోంది. దేశంలో ఇప్పటివరకు ట్రాఫిక్‌లు రద్దీ ఉన్న నగరాల్లో ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు ఉండేవి. వాటి స్థానంలో హైదరాబాద్ కూడా చేరిపోయింది. ఒక నగరం ముందుకెంత సాగుతుందో కాకుండా, ఎంతసేపు 'నిలబడు' తోందో కూడా అభివృద్ధికి ప్రమాణంగా మారుతోంది. ఇది మన ఉత్పాదకశక్తిని కూడా నీరుగారుస్తోందని నిపుణుల అభిప్రాయం. దీనికి అనారోగ్యం అదనం. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లతో కాలుష్యం పెరిగి గాలి నాణ్యత క్షీణి స్తోంది. పదేళ్ల కిందట 60- 80 మధ్య ఉన్న ఎక్యూఐ ఇప్పుడు సగటున 110-180 వరకు పెరిగింది. శీతాకాలంలో ఇది మూడు వందలు దాటుతోంది. వాహనాలనుంచి ఎగిసే పొగతో శ్వాసకోస సమస్యలు, అలర్జీలు, హృద్రోగాలు పెరుగుతున్నాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు వ్యాధుల బారిన పడుతున్నారు. గతంతో పోలిస్తే నలభై నుంచి అరవైశాతం వ్యాధులు పెరిగినట్టు అంచనా. ఇది నగరంలో మనిషి జీవించే పరిస్థితి లేదని చెప్పే సూచిక. ఇదంతా చూసినప్పుడు మనిషి సగటు ఆయురార్థం జీవితకాలంలో మూడు నాలుగేళ్లు తగ్గుతుందని వైద్యుల భావన. పైగా ట్రాఫిక్‌లో గడిపే సమయం పెరిగేకొద్దీ మానసిక ఒత్తిడి, చిరాకు, అలసట-ఇది దీర్ఘకాలంలో సగటు ఆయుష్షుపై కూడా ప్రభావం చూపుతుంది. ఇకపోతే పుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడం, పాదచారులు నడవలేకుండా ఉండటం, మెట్రోపిల్లర్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద అస్తవ్యస్తమైన ట్రాఫిక్ వ్యవస్థ కూడా నగరవాసుల్ని ప్రమాదం, అభద్రతలో పడేసే కారణాలు. ఇందులోనే మరో విషయం. మన పండగలు. సంస్కృతి సంప్రదయాల్ని ఎవరూ కాదనలేరు. మత విశ్వాసాలు వ్యక్తిగతం. కానీ, ఇటీవల శ్రీరామనవమి, హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా చేసిన హంగామా రహదారి వ్యవస్థను మరింత క్లిష్టతరం చేసింది. కిలోమీటర్ల పొడవునా ర్యాలీలు, వినోదాలు, విందులతో రోడ్లపై ట్రాఫిక్ స్తంభిస్తోంది. పోలీసులు దారి మళ్లింపులు చేపట్టినా చుట్టూ కిలోమీటర్ల దూరంతో గమ్యస్థానానికి చేరుకోవాల్సి వస్తోంది. ఉత్సవాల పేరుతో చేసే ఖర్చు, భక్తి పేరుతో పోటీ ప్రదర్శనలు, శబ్ద కాలుష్యం ఆందోళన కలిగిస్తున్నది. పండగల అసలు ఉద్దేశం సామరస్యాన్ని పెంచడమే కానీ, అసౌకర్యాన్ని కలిగించడం కాదు. దీన్ని నగరవాసులు గమనించాలి. ఇప్పటికైనా ప్రజారవాణాను బలపరిచే అంశాలపై సర్కార్ దీర్ఘకాలిక దృష్టి సారించాలి. ఇతర దేశాల్లోలాగా స్మార్ట్ సిగలింగ్ వ్యవస్థను పరిశీలించాలి. సామాన్యులకు అందుబాటులో ఉండేలా మెట్రోను విస్తరించాలి. లేదంటే భవిష్యత్తులో భాగ్యనగరమంటే 'స్తంభించిన నగరం'గా చెప్పుకోవాల్సి వస్తుంది.

# అమిత్ షా పర్యటనలో
# భద్రతా వైఫల్యం, ఘర్షణ..

### నలుగురు పోలీసాఫీసర్లను సస్పెండ్ చేసిన ఈసీ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనలోనే అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 2న మంత్రి అమిత్ షా బెంగాల్‌లోని భవానిపూర్‌లో పర్యటించారు. అక్కడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ షో నిర్వహించారు. అయితే, ఈ రోడ్ షోలో ఘర్షణ వాతావరణం తలెత్తింది. బీజేపీ శ్రేణులు పాల్గొన్న ఈ రోడ్ షోలో టీఎంసీకి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరుపక్షాల మధ్య



దాడి జరిగింది. సాధారణంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొనే కార్యక్రమాలకు కఠిన భద్రత ఉంటుంది. ఇలాంటి దాడులకు అవకాశం ఉండదు. కానీ, భవానిపూర్‌లో మాత్రం హింసాత్మక వాతావరణం ఏర్పడింది. దీంతో ఈ అంశంపై ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. దీనిపై నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శిని ఈసీ కోరింది. ఈ నివేదిక ఆధారంగా ఈసీ చర్యలు తీసుకుంది. అమిత్ షా పర్యటనలో అనేక భద్రతా వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించింది. దీనికి బాధ్యుల్ని చేస్తూ సిద్ధార్థ్ దత్తా అనే డీసీపీ సహా మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. శాంతి భద్రతల్ని కాపాడటంలో వీరు విఫలమయ్యారని ఆరోపించింది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో భవానిపూర్ నియోజకవర్గం చాలా కీలకం. ఎందుకంటే ఇక్కడి నుంచి సీఎం మమతా బెనర్జీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. వీరిలో ఎవరు గెలిచినా సీఎం కావడం ఖాయం. అయితే, మమతను ఓడించాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. అందుకే ఈ నియోజకవర్గంలో ఎన్నికల తతంగా ఆసక్తికరంగా మారింది.

# ఆ గ్యాస్ సిలిండర్‌లకు
# అడ్రస్ ప్రూఫ్ అక్కర్లేదు : కేంద్రం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
పశ్చిమాసియా లో యుద్ధం కారణంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఫలితంగా భయపెడుతున్న ఇంధన కొరత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని స్పష్టంచేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల దగ్గర ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. అదేవిధంగా దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళనచెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి




చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలులేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను అడ్రస్ ప్రూఫ్ నిబంధన లేకుండా విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపింది. మరోవైపు అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది

# అమెరికన్ పైలట్‌ను పట్టుకుంటే భారీ నజరానా..

### ఇరాన్ ప్రజలకు స్థానిక ప్రభుత్వం ఆఫర్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమానాన్ని ఇరాన్ తమ గగనతలంలో కూల్చిన సంగతి తెలిసిందే. ఈ విమానంలో ఇద్దరు పైలట్లు ఉంటారు. వారిలో ఒకరిని రెస్క్యూ టీమ్స్ రక్షించాయి. మరో పైలట్ తప్పించుకున్నాడు. అతడి ఆచూకీ మాత్రం తెలియడం లేదు. దీంతో ఆ పైలట్ ఆచూకీ కోసం ఇరాన్ దళాలు గాలిస్తున్నాయి. అంతేకాదు, స్థానిక ప్రజలు కూడా పైలట్ కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ ఆర్మీ, స్థానిక ప్రభుత్వాలు భిన్నంగా స్పందించాయి. అమెరికన్ పైలట్ కనిపిస్తే బంధించాలని, లేదా చంపాలని స్థానిక గవర్నర్ సూచించారు. పైలట్‌ను పట్టుకున్నా, చంపినా వారికి భారీ నజరానా అందిస్తామని గవర్నర్ ప్రకటించాడు. మరోవైపు ఇరాన్ ఆర్మీ మాత్రం భిన్నంగా



స్పందించింది. తమకు పైలట్ పట్టుబడితే అతడిని అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ ఖైదీగా పరిగణించి తగిన గౌరవం అందిస్తామని ఇరాన్ ఆర్మీ ప్రకటించింది. ఈ సందర్భంగా పాకిస్తాన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్‌లో కీలక ప్రకటన చేసింది. అమెరికన్లకు ఇరాన్ దళాలకన్నా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చాలా ప్రమాదకరమని ఇరాన్ వ్యాఖ్యానించింది. "ఇరాన్ కస్టడీలో ఉండటం కన్నా డొనాల్డ్ ట్రంప్‌తో ఉండటమే మీ పిల్లలకు చాలా ప్రమాదకరం. అందుకే, ఆ పైలట్ అమెరికా రెస్క్యూ టీమ్స్‌కు పట్టుబడటంకన్నా, ఇరాన్‌కు దొరకాలని కోరుకోండి. ముస్లింలుగా, నాగరికత తెలిసిన ఇరానియన్లుగా బంధీలను ఎలా గౌరవంగా, మర్యాదగా చూసుకోవాలో మాకు తెలుసు" అని ఇరాన్ ప్రకటించింది. అలాగే, దక్షిణాఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ కూడా దీనిపై ప్రకటన చేసింది. యుద్ధ ఖైదీలను తాము అమెరికా మిత్రదేశాలైన జియోనిస్టులలాగా చూడబోమని చెప్పింది. అమెరికాలాగా, రాతియుగం నాటి పద్ధతులు కాకుండా, నాగరిక విధానాలు తమకున్నాయని ఇరాన్ తెలిపింది. అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాల్ని ఇరాన్ శుక్రవారం కూల్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో ఒక పైలట్ తప్పించుకోగా, ఇంకో పైలట్ జాడ తెలియడం లేదు. అతడి కోసం ఇటు ఇరాన్, అటు అమెరికా కూడా వెతుకుతున్నాయి.

# అమరావతి శాశ్వత రాజధాని కి కృషి
# చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు

### టిడిపి పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు వాణి దాసరిరాజు

**రైల్వే కోడూరు, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా శాశ్వత రాజధాని అమరావతి కావాలని కృషిచేసిన అమరావతి రైతుల 1631 రోజుల ఉద్యమం ఫలించింది, కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రతిష్టాత్మక నిర్ణయం నేడు ఉభయ సభ లలో ఆమోదం పొంది రాష్ట్రపతి ఆమోదం అనంతరం పూర్తిస్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి కావడం దీని కొరకు కృషి చేసిన ప్రతి ఒక్క నాయకునికి, రైతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లకు ముఖ్యంగా భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని టిడిపి రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు వాణి దాసరిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక కుట్రలు కుతంత్రాలు జరిగి గత ప్రభుత్వంలో 1631 రోజులు అమరావతి రైతులు దీక్ష పూనుకుంటే ఆ యొక్క దీక్షను నాశనం చేయాలని కంకణం గట్టుకొని



అమరావతి వద్దు 3 రాజధానులు కావాలి అని ఆనాడు వైసీపీ ప్రభుత్వం చేసిన కుట్రలను జయించి నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధాని గా రావడం చాలా శుభ పరిణామంగా భావిస్తున్నానని, అంతేకాకుండా రాజధాని బిల్లును చట్టబద్ధంగా ముందుకు తీసుకువెళ్లిన ఆంధ్రప్రదేశ్ కూటమి ఎంపీల కృషి చాలా హర్షించదగ్గ విషయమని తెలియజేస్తూ, రానున్న రోజుల్లో అమరావతిని దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలపగల ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు గారిని కేంద్ర ప్రభుత్వంతో సమాయత్తం చేసుకుంటూ భారత ప్రధాని నరేంద్ర మోడీ గారి ఆశీస్సులతో అమరావతి రాజధాని అత్యున్నత స్థాయిలో ఉండే విధంగా మెరుగులు దిద్దుతారని ఆమె అన్నారు. అమరావతి రైతులు, టిడిపి నాయకులు అమరావతి రాజధానిగా ఉండాలని ఉద్యమాలు చేపట్టిన నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వం వీటన్నిటినీ నిర్వీర్యం చేస్తూ మేము చెప్పిందే వినాలి మేము చెప్పిందే వేదం అంటూ శాసనమండలి రద్దు చేయడానికి కూడా వెనుకాడని ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వం అని అటువంటి వారికి నేడు సరైన దీటైన సమాధానమిస్తూ ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన పిమ్మట ఢిల్లీలోని ఉభయసభల్లో ఈ బిల్లు ఆమోదం పొందడం వారికి మింగుడు పడక అక్కడ కూడా వైసీపీ ఎంపీలు మద్దతు ఇవ్వకుండా వాకౌట్ చేయడం వారి యొక్క పరాకాష్టకు ఇది నిదర్శనమని ఆమె దుయ్యబట్టారు. ఏది ఏమైనప్పటికీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం హయాంలో అమరావతి రాజధాని కావడం మాకందరికీ చాలా ఆనందమైనటువంటి విషయంగా పరిగణిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.

# వైసీపీ కార్యకర్త ఆనంద్ కుటుంబానికి బైక్ భాస్కర్ రెడ్డి ఆర్థిక సాయం



**తనకల్లు, ఏప్రిల్ 04: డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
తనకల్లు మండలం, చీకటి మానిపల్లి పంచాయతీ, పడమటివారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని క్రియాశీల కార్యకర్త జె. ఆనంద్ అకాల మరణం చెందడం పార్టీకి తీరని లోటు అని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆనంద్ మరణ వార్త తెలుసుకున్న శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు బైక్ భాస్కర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి తక్షణ సహాయార్థం రూ. 10,000 (పది వేల రూపాయలు) ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పడమటివారిపల్లికి చెందిన వైసీపీ నాయకులు జై చంద్రారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, రమణప్ప పాల్గొన్నారు. అలాగే చీకటిమానిపల్లి పంచాయతీ నాయకులు నాగిరెడ్డి, బాబు, పసల కిష్టప్ప, ఆదెన్న, జగనన్న యూత్ లీడర్లు ఉద్దాల ప్రవీణ్ కుమార్, బాలినేని గణేష్, సోషల్ మీడియా ప్రతినిధులు బాలినేని చిన్న, కరుణాకర్ తదితరులు హాజరై ఆనంద్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# గాజులు వీధి రామాలయంలో ఘనంగా సీతారాముల కళ్యాణోత్సవం



**చిట్వేల్, ఏప్రిల్ 6 డ్రీమ్ టైమ్స్:**
చిట్వేల్ మండలంలోని గాజులు వీధి రామాలయంలో ఆదివారం శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవాన్ని చిట్వేల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి దంపతులు నిర్వహించడం విశేషం. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ దివ్య కళ్యాణం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అనంతరం సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి కళ్యాణం నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ తాళంబ్రాలు, మంగళసూత్రధారణ కార్యక్రమాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి భగవంతుని ఆశీస్సులు కోరుకున్నారు. గ్రామ ప్రజలు ఐక్యంగా కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆనందదాయకమని వారు తెలిపారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని తిలకించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తం మీద గాజులు వీధి రామాలయం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

# సీతారాముల కళ్యాణ మహోత్సవంలో కస్తూరి



**చిట్వేలు, ఏప్రిల్ 4 డ్రీమ్ టైమ్స్:**
మండలంలోని తుమ్మచట్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల సుబ్బరాయుడు (లారీ) ఆహ్వానం మేరకు ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కస్తూరి విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగ అధ్యక్షులు పంతగాని నర్సింహ ప్రసాద్, మండల అధ్యక్షుడు కాకర్ల నాగార్జున నాయుడు, నాయన బాలాజీ, సేతు శంకర యాదవ్, దుగ్గిని వెంకటయ్య, బాలు రామాంజనేయ నాయుడు, బుంగటవల రాజశేఖర్ నాయుడు, మహేశ్వర్ రెడ్డి, నరసింహులు తదితర నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తాతంశెట్టి నాగేంద్ర జాగ్రత్త పడకపోయి ఉంటే
# మా ఎమ్మెల్యే పై దాడి జరిగి ఉండేది

- తర్వాత పరిణామాలు ఎలా ఉండి ఉందో మీ ఊహకే వదిలేస్తున్నాం
- తాతంశెట్టి నాగేంద్ర పోలీసుల లాటి తీసుకొని కొట్టాడు అనడం ముమ్మాటికి అవాస్తవం
- అది లాఠీ కాదు, మా పార్టీ జెండా యొక్క ప్లాస్టిక్ పైపు
- లాఠీ కి ప్లాస్టిక్ పైప్ కి తేడా తెలియని కొంతమంది కుహునా మేధావులు రాద్ధాంతం చేస్తున్నారు
- జనసేన పార్టీ నాయకులు పై వస్తున్న ఆరోపణలు ఖండించిన
- జనసేన బిసి నాయకుడు బత్తిన గంగన్న యాదవ్, పుల్లంపేట సింగల్ విండో చైర్మన్ పసుపులేటి వెంకటరమణ




**రైల్వే కోడూరు, ఏప్రిల్ 04, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు లో గత రెండు రోజుల కిందట జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మహిళ వాణి మీద దాడి చేశారని ,దౌర్జన్యం చేశాడని ప్రసార మాధ్యమాలలో కొంతమంది అత్యుత్సాహంతో ప్రసారం జరుగుతున్న విషయం అందరికీ తెలిసిన విషయమేనని శనివారం రైల్వే కోడూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జనసేన పార్టీ బీసీ నాయకులు బత్తిన గంగయ్య యాదవ్ మరియు పుల్లంపేట సింగల్ విండో చైర్మన్ పసుపులేటి వెంకటరమణ అన్నారు. ఈ సమావేశంలో బత్తిన గంగయ్య యాదవ్ మాట్లాడుతూ జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయ ఆదేశాల మేరకు అమరావతి రాజధానిగా ఉభయ సభలలో ఆమోదం పొందినందున విజయోత్సవ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అమరావతి రాజధాని కొరకు చేసిన కృషిని తెలియజేయాలని రైల్వే కోడూరు జనసేన పార్టీ కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. అనంతరం టోల్గేట్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహాని కి పూలమాల వేసి, పక్కనే ఉన్న ఇంద్ర బస్ షెల్టర్ నందు కేక్ కటింగ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేక్ కటింగ్ కార్యక్రమానికి మా రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ వస్తున్నాడని తెలుసుకున్న వైయస్సార్సిపి కోవర్ట్ వీణ మరియు తన అంగరక్షకుడు గోపి ఇద్దరు కలసి తమ వైసిపి నాయకుల ద్వారా సమాచారం అందుకొని మా కన్నా ముందే సంఘటనా స్థలాన్ని చేరుకొని మా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పై దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నారని సమగ్ర సమాచారం మేరకు ఇంద్ర బస్ షెల్టర్ పక్కన ఉన్న పూల అంగడి వద్దకి ముందుగానే చేరుకొని ఇద్దరు పూల అంగడిలో ఉంటూ వీడియోలు తీసుకుంటూ,ఎమ్మెల్యే శ్రీధర్ అక్కడికి చేరుకోగానే ఎమ్మెల్యే మీద దాడి చేయడానికి సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో తాతంశెట్టి నాగేంద్ర వారి యొక్క దాడి విషయాన్ని గమనించి ఎమ్మెల్యే అక్కడికి చేరుకోగానే ఎమ్మెల్యేను కారు దిగవద్దు అని చెప్పి , పోలీస్ వారిని అలెర్ట్ చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఆలోచనలో ఉండగా వాణి, గోపీలు వారు అనుకున్న పథకం ప్రకారం దాడి చేసే లోపు అక్కడ ఉన్న పోలీసు వారు వారిస్తున్నప్పటికీ వినకుండా దాడికి ప్రయత్నించడం జరిగింది. ఆ సమయంలో మా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర సమీపంలో ఉన్న ప్లాస్టిక్ పైప్ తీసుకొని మీరెందుకు ఇక్కడికి వచ్చారు మీకు ఏదైనా చెప్పుకోవాలనివి స్తే మాట్లాడాలనిపిస్తే కోర్టు ద్వారా మాట్లాడండి అంటూ చెప్పడంతో వీణ తన నోటికి వచ్చిన భాషతో మా ఎమ్మెల్యేను అలాగే మా జనసేన పార్టీ నాయకులను మాట్లాడటంతో అసహనానికి లోనై మీరు వెళ్తారా వెళ్ళరా అంటూ చెప్పడం జరిగింది. తాతంశెట్టి నాగేంద్ర ప్లాస్టిక్ పైపు తీసుకోకపోయి ఉన్న ,ఎమ్మెల్యే కారు దిగి ఉంటే వీణ, గోపి ఇద్దరూ ఎమ్మెల్యే మీద దాడి చేసి ఉంటారు అని కచ్చితంగా చెప్పగలం ఎందుకంటే వాళ్ళ పథకం ప్రకారమే ఉదయం టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కు పోవడం, సాయంత్రం ర్యాలీ అనే విషయం తెలుసుకొని ఎలాగైనా ఏదో ఒక రకంగా జనసేన పార్టీని ఎమ్మెల్యే అని డ్యామేజ్ చేయాలని కంకణం కట్టుకొని మరి పూల మీద సొట్టుతో అక్కడికి రావడం అని చిన్న పిల్లవాడిని అడిగిన తెలిసిపోతుందని రైల్వే కోడూరు నియోజకవర్గ ప్రజానీకానికి తెలియజేస్తూ, రైల్వే కోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పైన కానీ మా జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలపై గాని ఎవరైనా దాడులకు దిగితే సహించేది లేదని వారన్నారు.

# వండేదెలా.. కడుపు నింపేదెలా..?



గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి



**-ప్రభుత్వ ఆసుపత్రుల్లో భోజనాలకు కష్టకాలం**

**గుంతకల్లు, ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్):**
యుద్ధ ప్రభావంతో గ్యాస్ కష్టాలు అందరినీ వెంటాడుతున్నాయి. ఈ ప్రభావం ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే ఆహారం పైనా పడింది. గ్యాస్ కొరతతో రోగులకు సకాలంలో భోజనం వండి పెట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. అనంతపురం జిల్లాలో గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వివిధ ఆరోగ్య సమస్యలతో చేరిన రోగులకు చాలా ఏళ్లుగా ఉచితంగా భోజనాలు అందిస్తున్నారు. ఒక రోగికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం ఆకుకూర, ఉడికించిన కోడి గుడ్డుతో భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ఇలా మొత్తం నాలుగు పూటలకూ కలిపి ప్రభుత్వం రోజుకు ఒకరికి రూ.77 నుంచి రూ.80 వరకు చెల్లిస్తోంది. రోగితోపాటు సహాయకునిగా వచ్చిన ఒకరికి మూడు పూటలా ఆహారం అందిస్తున్నారు. అంతకుముందు వరకూ దీని ధర కేవలం రూ.40 మాత్రమే ఉండేది. నిత్యావసర ధరలు, అన్ని ఖర్చులూ పెరిగిపోవడంతో నిర్వాహకుల విజ్ఞాపన మేరకు ప్రభుత్వం వీటి ధరలు పెంచింది. అన్నీ సజావుగా సాగిపోతున్న తరుణంలో ఇప్పుడు గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. గతంలో అవసరానికి రావాల్సిన గ్యాస్ సిలిండర్లను ఆయా ఏజెన్సీలు సరఫరా చేసేవి. ప్రస్తుతం కొరత కారణంగా ఆ పరిస్థితి కనిపించడం లేదు. సాధారణ గృహ వినియోగదారులు తమ పేరిట ఉన్న కనెక్షన్ ద్వారా సిలిండరు పొందాలంటే కనీసం 45 రోజులు నిరీక్షించాల్సి వస్తోంది. గతంలో ఈ గడువు 25 రోజులు ఉండేది. ప్రాంతీయ ఆసుపత్రుల్లో రోజుకు 40 నుండి 50 మంది దాకా రోగులకు భోజనాలు పెడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు భోజనం వండి పెట్టే నిర్వాహకులు ముందుగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఆ తరువాత విడతల వారీగా వారికి ప్రభుత్వం బిల్లులు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇప్పుడు గ్యాస్ సిలిండర్ల కొరత వీరిని వేధిస్తోంది. కట్టెలపై అంతమంది రోగులకు వంట చేసి పెట్టడం అంత తేలిక కాదు. ఆ పరిస్థితి లేదు. ప్రత్యామ్నాయ మార్గాలు కనిపించక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రుల్లో రోగులకు అందించే ఆహారం విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అవసరమైన సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు లేఖ రాశాం:**
ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు వారి వెంట వచ్చే సహాయకులకు భోజనం అందించే విషయంలో ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై అనంతపురం డి సి హెచ్ ఎస్ డాక్టర్.డేవిడ్ పాల్ దృష్టికి 'డ్రీమ్ టైమ్స్' ప్రతినిధి తెచ్చారు. గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు, వారి వెంట వచ్చే సహాయకులతో పాటు వసతి గృహంలో వేచి ఉండే వారికి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సిలిండర్లను మంజూరు చేయాలని సంబంధిత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

# వైద్యాధికారికి ప్రేమపూర్వక వీడ్కోలు.



రుద్రవరం.(డ్రీమ్ టైమ్స్)
ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ట్రైబల్) ప్రధాన వైద్యాధికారిగా సేవలందిస్తున్న డాక్టర్ అమర్నాథ్ రెడ్డికి స్థానిక ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది శనివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు.ఆప్తమాలజీ (కంటి వైద్యం) విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆయన శనివారం తన బాధ్యతల నుండి రిలీవ్ అయ్యారు.గత నాలుగు సంవత్సరాలుగా డాక్టర్ అమర్నాథ్ రెడ్డి ఆలమూరు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. గిరిజన ప్రాంతమైన ఇక్కడ ఆయన అంకితభావంతో, కచ్చితమైన సమయపాలన పాటిస్తూ ప్రజలకు విశేష సేవలు అందించారు. వైద్యం కోసం వచ్చే రోగులతో ఆప్యాయంగా మాట్లాడుతూ, వారికి నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని నింపేవారు. ఆయన సేవాతత్పరతకు చుట్టుపక్కల పల్లె ప్రజల నుండి విశేషమైన ప్రేమాభిమానాలు లభించాయి. ఒక ప్రభుత్వ వైద్యుడిగా రోగుల పట్ల ఆయన చూపిన శ్రద్ధ అందరికీ ఆదర్శప్రాయం అని పలువురు కొనియాడారు.ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్తున్న డాక్టర్ అమర్నాథ్ రెడ్డిని శనివారం ఆసుపత్రి సిబ్బంది, ఆలమూరు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కంటి వైద్య నిపుణుడిగా ఆయన భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరింత మందికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ తమ హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ హయాంలోనే దేవాలయాలు అపవిత్రమవుతున్నాయి..!

-ఆలూరు వైసిపి ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి




గుంతకల్లులో వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి



ఆలూరులో పాండురంగ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి

**ఆలూరు, ఏప్రిల్ 4(డ్రీమ్ టైమ్స్):** కూటమి ప్రభుత్వ హయాంలోనే హిందూ దేవాలయాలు అపవిత్రమవుతున్నాయని కర్నూలు జిల్లా ఆలూరు వైసిపి ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి పేర్కొన్నారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడును ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం వైసిపి అధిష్టానం ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోని వైష్ణవాలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆలూరు లోని ఆర్ అండ్ బి అతిధి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పవిత్రమైన ఆధ్యాత్మికపరమైన సంస్థలో మంచి హోదాలో ఉంటున్న బి.ఆర్ నాయుడు ఇటీవల కాలంలో ఓ మహిళతో సన్నిహితంగా ఉంటున్న వీడియో వైరల్ అయింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద దుమారం రేగుతుంది. హిందూ ధార్మిక సంస్థల్లో పెద్ద స్థాయిలో ఉంటున్న వారు ఎంతో ఉన్నతంగానూ, నైతిక విలువలను పాటించాల్సి ఉంటుంది. అలాంటిది బి.ఆర్ నాయుడు ఓ మహిళతో సన్నితంగా ఉంటున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపి నాయుడును తక్షణమే టీడీపీ చైర్మన్ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు అధికమవుతున్నాయని, అదే క్రమంలో శాంతి భద్రతలు కూడా పూర్తిగా అదుపు తప్పాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**గుంతకల్లులో:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల్లో అభద్రతా భావం చోటు చేసుకుటోందని గుంతకల్లు తాజా మాజీ మున్సిపల్ చైర్మన్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి పేర్కొన్నారు. హిందూ దేవాలయాలు, సనాతన ధర్మం గురించి నీతులు చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గొప్పగా బాకాలు ఊదుతున్నారన్నారు. ప్రతి మనిషి నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. అప్పుడే ఆ వ్యక్తికి, ఆ వ్యక్తి అనుభవించే హోదాకు ఓ గుర్తింపు లభిస్తుందన్నారు. బి ఆర్ నాయుడును తక్షణమే టిటిడి చైర్మన్ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఆమె వైసీపీ శ్రేణులతో కలిసి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

# సుధాకర్ బాబు ఇంటి మీద పోలీసులు దాడి చేయడం అమానుషం: లింగం లక్ష్మీకర్



**చిట్వేల్, ఏప్రిల్ 04 డ్రీమ్ టైమ్స్** మాజీ మంత్రి సుధాకర్ బాబు ఇంటిపై పోలీసులు దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి లింగం లక్ష్మీకర్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నేతలపై ఇలాంటి చర్యలు అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపుతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. సుధాకర్ బాబు కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదన్నారు. పోలీసులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తూ రాజకీయ నాయకులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు రాజకీయాలకు అతీతంగా పని చేయాలని సూచించారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి నిజానిజాలు వెలికి తేవాలని లింగం లక్ష్మీకర్ కోరారు.

# గుంతకల్లు రైల్వే డిఆర్ఎం కార్యాలయం ఎదుట సిటీఎస్ కార్మికుల ధర్నా



**గుంతకల్లు, ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్):** వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రైల్వే సిటి ఎస్ కార్మికులు శనివారం గుంతకల్లు రైల్వే డిఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు గుంతకల్లు పట్టణ ప్రధాన కార్యదర్శి శాఖ నాగరాజు మాట్లాడుతూ.. గుంటకల్ రైల్వే సిటిఎస్ కాంటాక్ట్ కార్మికులకు కొత్తగా వచ్చిన ఆర్డర్ ఒకటే షిఫ్ట్ డ్యూటీ 12 గంటల పని విధానాన్ని ఆర్డర్ ను రద్దు చేయాలని, పాత పద్ధతిని కొనసాగించాలని కోరారు. ఈ పేరుతో అక్రమంగా కార్మికులను తొలగించరాదని. కాంట్రాక్టర్ మారినప్పుడల్లా కార్మికుల్ని అన్యాయంగా తొలగించరాదు. కొత్త కాంట్రాక్టర్ వచ్చి 8 నెలలైనా కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ ఇంతవరకు వర్తింప చేయకపోవడం అన్యాయం అన్నారు. రెండు నెలలుగా జీతాలు పెండింగ్లో పెట్టి కార్మికుల కడుపు కొట్టడం దారుణమన్నారు. వెంటనే పెండింగ్లో ఉండే జీతాలు ఇవ్వాలని. కనీస వేతనాలు 26 వేల రూపాయలు, రైల్వే లేబర్ యాక్ట్ ప్రకారం జీతాలు చెల్లించాలని. కార్మికులకు రక్షణ కల్పించాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని. డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిఆర్ఎమ్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ నాయకులు జయరాజ్, రత్నమయ్య, ఆంజనేయులు, మస్తానయ్య సుబ్రమణ్యం, సుంకన్న, అలిగెరప్ప, రామంజినేయులు , సుధా,చిన్న గోవిందు, బాబు,తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో చలివేంద్రం ఏర్పాటు.



**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)** మండల కేంద్రము లోని 40 వ జాతీయ రహదారి ప్రక్కన శిరివెళ్ల మెట్ట వద్ద దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈటుకూరు వెంకట్ సహకారంతోనంద్యాల జిల్లా ఆళ్లగడ్డ తాలూకా శిరివెళ్ల మండల కేంద్రంలో శనివారం శుద్ధ జల కలువ నీటి చలివేంద్రాన్ని దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వర్ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకే వేసవికాలంలో ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. 40 వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే నాలుగు రోడ్ల జంక్షన్లో ప్రయాణికులు టూ వీలర్లు గోస్పాడు,శిరివెళ్ల, దొర్నిపాడు, రుద్రవరం ,తదితర మండలాలకు చెందినటువంటి ప్రయాణికుల సౌకర్యార్థం మండువేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఏ. నాగమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కార్మిక కర్షక విద్యా ఉద్యోగ వర్గాలకు ఎంతగానో ఈ చలివేంద్రం దోహదపడుతుందని అన్నారు. వేసవికాలంలో ప్రయాణికులు బస్సుల కోసం ఆటోలు కార్లు ఇతర వాహనాల కోసం ఎదురుచూస్తూ ప్రతిగా ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేయడం పట్ల మొదటి రోజు అన్ని చలివేంద్రంలోని కుండలలో గంటలోపే నీళు ్ళ ఖాళీ కావడంతో తిరిగి చలువ నీటి శుద్ధ జలాన్ని చలివేంద్రంలో నింపడం జరిగిందని అన్నారు. మార్చి వెళ్లి ఏప్రిల్ రావడం అధిక ఉష్ణోగ్రత ఉగ్రరూపం దాల్చడం త్రాగునీటి సమస్యలు అధికం కావడం పట్ల నియోజకవర్గంలోనే మొట్టమొదటిసారిగా దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మామిడి తోరణాలు చలువ పందిల్లు వేసి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కోటపాడు, వీరారెడ్డిపల్లి, శిరివెళ్ల,గోవిందపల్లి, కామినేనిపల్లి, వెంకటాపురం తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వర్ రెడ్డి తో పాటు అన్నెం నాగేశ్వర్ రెడ్డి, అన్నెం సుధాకర్ రెడ్డి,సుబ్బారెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్య ,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి



కర్ణాటక రాష్ట్రం సిందనూరులో మంత్రి నారా లోకేష్ ను సన్మానిస్తున్న మంత్రాలయం నియోజకవర్గం తెదేపా పార్టీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, కర్ణాటక కేంద్ర మంత్రి కుమారస్వామి

**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ మంత్రాలయం :-** కర్ణాటక రాష్ట్రం సింధనూరు లో సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవ , టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య ఉ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ,కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి , కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ని మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకు ముందు , విద్య ఉ ఐటీ శాఖ నారా లోకేష్ బొకె , శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గ సమస్యలు నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు... ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు..

# వైభవంగా సుశమీంద్ర తీర్థుల ఆరాధన



టీటీడీ అధికారి రామకృష్ణను సన్మానిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు



తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి టీటీడీ అధికారి రామకృష్ణ తెచ్చిన పట్టు వస్త్రాలను శిరస్సుపై ఉంచుకుని తీసుకొస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

-సుశమీంద్ర తీర్థుల బృందావనానికి టీటీడీ పట్టువస్త్రాలు సమర్పణ



బంగారు రథం పై ఉంచిన పూర్వ పీఠాధిపతి సుశమీంద్ర తీర్థుల చిత్రపటానికి హారతి ఇస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ మంత్రాలయం , ఏప్రిల్ 4,** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో పూర్వపు పీఠాధిపతులు సుశమీంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుశమీంద్ర తీర్థుల బృందావనానికి మహా పంచామృతాభిషేకంతో పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం సుశమీంద్ర తీర్థుల చిత్రపటాన్ని స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు పూజలు చేసి మంగళహారతి ఇచ్చి , భక్తుల మధ్య , భాజా భజంత్రీల మధ్య మఠం ప్రాకారంలో ఊరేగించారు. అంతకుముందు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు సంస్థాన పూజల్లో భాగంగా మూల రామదేవతలకు పీఠాధిపతులు దీప దూప నైవేద్యాలను సమర్పించే మంగళహారతి ఇచ్చారు.

**టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ**

: సుశమీంద్ర తీర్థుల ఆరాధన సందర్భంగా శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా టీటీడీ అధికారులు రామకృష్ణ , ఆలయ అర్చకులు మంత్రాలయం చేరుకున్నారు. వారికి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం అధికారులు మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, సహాయ మేనేజర్ ఐపీ నరసింహా మూర్తి, ధార్మిక సిబ్బంది వ్యాస రాజాచార్, కుర్ది జయతీర్థాచార్ పండితులు శ్రీమఠం ముఖ ద్వారం దగ్గర నుంచి మేళతాళాలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి శ్రీవారి పట్టు వస్త్రాలను స్వర్ణ పల్లకిలో ఊరేగిస్తూ శ్రీమఠం చేరుకోగా పీఠాధిపతులు శ్రీ సుబుదేంద్ర తీర్థులు గౌరవ మర్యాదలతో ఆహ్వానించి పట్టువస్త్రాలను స్వీకరించారు. అనంతరం పట్టువస్త్రాలను శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనం ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారులు రామకృష్ణ ,ఆలయ అర్చకులను పీఠాధిపతులు శ్రీ సుబుదేంద్ర తీర్థులు శేషవస్త్రం, ఫల మంత్రాక్షితలు, జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు.

# బిజినెస్

## మార్కెట్లోకి రెడ్‌మీ నోట్ 15 స్పెషల్ ఎడిషన్



**హైదరాబాద్ :**
షావోమి ఇండియా తాజాగా రెడ్‌మీ నోట్ 15 స్పెషల్ ఎడిషన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 6.77-అంగుళాల కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 3 ప్రాసెసర్, 5800 ఎంఎహెచ్ భారీ బ్యాటరీ వంటి అత్యాధునిక ఫీచర్లతో రూపొందిన ఈ ఫోన్ ఏప్రిల్ 7 నుండి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని ఆ సంస్థ తెలిపింది.

## మళ్లీ అదే జోరు..
## పరుగులు పెడుతున్న బంగారం ధరలు..

### హైదరాబాద్‌లో తులం ఏంతంటే..

గత కొద్ది రోజులుగా బంగారం, వెండి ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో ఇటీవల భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు ప్రస్తుతం తిరిగి పుంజుకుంటున్నాయి. గత నెలలో రెండు లోహాల ధరలు భారీగా పతనం అయ్యాయి. మార్చి నెల చివర నుంచి మళ్లీ పరుగులు పెడుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు బంగారం, వెండి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. శనివారం బంగారం, వెండి ధరల్లో పెరుగదల నమోదైంది. తాజాగా ఏప్రిల్ 4వ తేదీన దేశంలో బంగారం ధర స్వల్పంగా పెరిగితే వెండి కూడా స్వల్పంగా తగ్గింది. నిన్న ఒక్క రోజే తులం బంగారం ధర 2 వేల రూపాయల వరకు పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం,



వెండి ధరలు ఇలా ఉన్నాయి.
హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,50,940 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,38,360 ఉంది.
విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,50,940 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,38,360 ఉంది.
ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,38,510 ఉంది.
ముంబై 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,50,940 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,38,360 ఉంది.
చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,100 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,38,510 ఉంది.
బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,50,940 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,38,360 ఉంది.

## ఇరాన్ ప్రకటనపై స్పందించిన డెల్..

### ఉద్యోగులకు ట్రావెల్ అడ్వయిజరీ జారీ

ఇరాన్ ప్రభుత్వం తనను ఉగ్రవాద సంస్థ గా ప్రకటించడంపై అమెరికాకు చెందిన మల్టీనేషనల్ కంపెనీ డెల్ స్పందించింది. తన ఉద్యోగుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ అంతర్గతంగా ట్రావెల్ అడ్వయిజరీ జారీచేసింది. ఉద్యోగులెవరూ ఇరాన్‌కు వెళ్లవద్దని, అక్కడ ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. ఇరాన్ సంస్థలు లేదా ఆ దేశ వ్యక్తులతో ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దని




కఠిన ఆదేశాలు జారీ చేసింది.అదేవిధంగా కంపెనీ డేటా, నెట్‌వర్క్ భద్రతపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని డెల్ తన ఐటీ విభాగాలను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అమెరికా-ఇరాన్ ఘర్షణ ఇప్పుడు క్షిపణుల నుంచి గ్లోబల్ టెక్నాలజీ, ఫైనాన్స్ సంస్థల వైపు మళ్లినట్టుగా కనిపిస్తోంది. అమెరికాకు చెందిన 18 ప్రముఖ కంపెనీలు తమ హిట్ లిస్టులో ఉన్నాయని ఐఆర్జీసీ తన టెలిగ్రామ్ ఛానల్ ద్వారా స్పష్టంచేసింది. ఈ ఐటీ సంస్థలన్నీ అమెరికా నిఘా వర్గాలకు సమాచారాన్ని చేరవేస్తున్నాయని ఆరోపించింది.

## స్వదేశానికి వెళ్లిన సన్‌రైజర్స్ ఆటగాడు ప్యాట్ కమిన్స్


పాట్ కమిన్స్ గత కొంతకాలంగా వెన్నునొప్పితో సతమతమవుతున్నాడు. ఈ గాయం కారణంగానే ఆయన గతేడాది యాషెస్ సిరీస్‌తో పాటు టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే తాను మొదటి సగం మ్యాచ్‌లకు అందుబాటులో ఉండనని కమిన్స్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో బరిలోకి దిగేందుకు ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు నుంచి అనుమతి లభించలేదు. దీంతో తుది స్కాన్, ఫిట్‌నెస్ క్లియరెన్స్ కోసం ఆయన స్వదేశానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో హైదరాబాద్ జట్టుకు భారీ షాక్ తగలనుంది. కమిన్స్ గైర్హాజరీలో విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో హైదరాబాద్ ఈ సీజన్ మొదటి మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో ఓడిపోయినప్పటికీ, రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 65 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి




ఫామ్‌లోకి వచ్చింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉన్న హైదరాబాద్, తన తదుపరి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. కమిన్స్ తిరిగి వచ్చే వరకు కిషనే జట్టును నడిపించనున్నాడు. తాజా సమాచారం ప్రకారం, ఆస్ట్రేలియాలో జరిగే వైద్య పరీక్షల్లో కమిన్స్ ఫిట్‌గా ఉన్నట్లు తేలితేనే ఆయన తిరిగి భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ 17 నాటికి ఆయన మళ్ళీ జట్టుతో కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ స్కాన్ నివేదికలు ప్రతికూలంగా వస్తే, ఈ సీజన్ మొత్తానికి ఆయన దూరం కావచ్చు. కమిన్స్ లేని పక్షంలో జట్టులో విదేశీ ఆటగాళ్లుగా ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ మలింగ వంటి వారు కీలకం కానున్నాడు. పాట్ కమిన్స్ కేవలం అద్భుతమైన బౌలర్ మాత్రమే కాదు, చతురత కలిగిన నాయకుడు కూడా. గత సీజన్‌లో జట్టును ముందుండి నడిపించిన ఆయన అనుభవం ఇప్పుడు సన్‌రైజర్స్‌కు ఎంతో అవసరం. అయితే ఇషాన్ కిషన్ నాయకత్వంలో యువ ఆటగాళ్లు రాణిస్తుండటం జట్టుకు సానుకూల అంశం. రేపు రాజీవ్ గాంధీ స్టేడియంలో లక్నోతో జరిగే మ్యాచ్‌లో హైదరాబాద్ విజయం సాధించి పాయింట్ల పట్టికలో ముందుకు వెళ్లాలని పట్టుదలగా ఉంది.

## రాజస్థాన్‌కు రెండో విజయం..!

ఐపీఎల్‌లో ఏకపక్ష మ్యాచ్‌లతో విసిగిపోయిన అభిమానులను ఉత్కంఠ పోరు అలరించింది. భారీ స్కోర్ల పోరులో ఆఖరి ఓవర్ వరకూ ఆధిపత్యం చేతులు మారుతూ వచ్చిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌నే విజయం వరించింది. 211 పరుగుల ఛేదనలో సాయి సుదర్శన్(73) మెరుపులతో గెలుపు దిశగా సాగిన గుజరాత్ టైటాన్స్‌ను లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్(4-41)దెబ్బతీశాడు. చివరి ఓవర్లో ఆ జట్టు గెలవాలంటే 10 చేయల్సి రాగా.. తుషార్ దేశ్‌పాండే అద్భుతంగా బౌలింగ్ చేసి రాజస్థాన్‌ను గెలిపించాడు. యార్కర్లతో గుజరాత్ బ్యాటర్లను నిలువరించిన ఈ కుర్రాడు 4 పరుగులే ఇవ్వడంతో రియాన్ పరాగ్ సేన వరుసగా రెండో విక్టరీ కొట్టింది.ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ రెండో విజయంతో మురిసింది. భారీ స్కోర్‌తో గుజరాత్ టైటాన్స్‌కు సవాల్ విసిరిన రాజస్థాన్ బౌలర్ల విజృంభణతో మ్యాచ్‌ను కాపాడుకుంది. భారీ ఛేదనను దూకుడుగా ఆరంభించిన గుజరాత్ టైటాన్స్.. ఊహించని విధంగా తడబడింది. ఓపెనర్లు సాయి సుదర్శన్(73),





కుష్రగ(18)లు తొలి వికెట్‌కు 78 పరుగులు జోడించి గెలుపు దిశగా నడిపారు. కానీ, కుష్రగను ఔట్ చేసి బ్రేకివ్వగా.. అర్ధ శతకంత తర్వాత సుదర్శన్ వెనుదిరిగాడు.

**బిష్ణోయ్ .. రెండు వికెట్లతో**

జోస్ బట్లర్(26) ఉన్నాడన్న ధీమాతో ఉన్న గుజరాత్‌ను ఇంప్యాక్ట్ సబ్ రవి బిష్ణోయ్(4-41) దెబ్బ కొట్టాడు. ఒకే ఓవర్లో డేంజరస్ గ్లెన్ ఫిలిప్స్ (3), వాషింగ్టన్ సుందర్(0)... రెండు వికెట్లతో మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పాడు. ఆ తర్వాతి ఓవర్లో బట్లర్‌ను బర్గర్ బోల్తా కొట్టించాడు. అంతే.. అప్పటివరకూ పటిష్ట స్థితిలో ఉన్న గుజరాత్ ఒక్కసారిగా పడిపోయింది.
ఇంప్యాక్ట్ సబ్ షారుక్ ఖాన్(11) వస్తూనే సిక్స్, ఫోర్‌తో తెగబడ్డాడు. తన ఓవర్లో రెండు ఫోర్లు బాదిన రాహుల్ తెవాటియా(12)ను ఔట్ చేసి ప్రత్యర్థిని మరింత ఒత్తిడిలో పడేశాడు. రెండో పరుగుకు యత్నించిన షారుక్ రనౌట్ కావడంతో గుజరాత్ విజయావకాశాలు దెబ్బతిన్నాయి. కానీ, కెప్టెన్ రషీద్ ఖాన్(24), కగిసో రబడ(23 నాటౌట్)లు పట్టు వదలకుండా బౌండరీలతో భయపెట్టారు. సందీప్ శర్మ ఓవర్లో రబడ సిక్సర్ బాదడంతో మ్యాచ్ గుజరాత్ వైపు మొగ్గింది. దేశ్‌పాండే వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో 10 పరుగులు అవసరమవ్వగా.. ఊదో బంతికి రషీద్ సిక్సర్‌కు ప్రయత్నించగా బౌండరీ వద్ద ఆర్చర్ క్యాచ్ అందుకున్నాడు. చివరి బంతికి రావడంతో రాజస్థాన్ ఊపిరి పీల్చుకుంది.

# స్పోర్ట్స్

## సంజు శాంసన్ కు కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మద్దతు



ఐపీఎల్ 2026 సీజన్లో సీఎస్కే తరఫున ఆడుతున్న సంజు శాంసన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజస్థాన్ రాయల్స్ నుంచి భారీ అంచనాలతో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి వచ్చిన సంజు శాంసన్.. ఇప్పటివరకు ఆడిన రెండు ఇన్నింగ్స్‌లలో కేవలం 6, 7 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన ప్లేయర్ ఇలా వరుసగా విఫలమవ్వడంతో అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అయితే జట్టు హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాత్రం తమ ఆటగాడికి పూర్తి మద్దతుగా నిలిచారు. మీడియా సమావేశంలో సంజు శాంసన్ ఫామ్ గురించి అడిగిన ప్రశ్నపై స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పందిస్తూ.. విమర్శకులకు గట్టి సమాధానం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. " టీ20 క్రికెట్లో ప్రతి మ్యాచ్‌లోనూ పరుగులు సాధించడం సాధ్యం కాదు. సంజు శాంసన్ ప్రస్తుతం మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. నెట్స్‌లో సంజు అద్భుతంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. కేవలం రెండు ఇన్నింగ్స్‌ల ఆధారంగా సంజు శాంసన్ సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయలేం. ఒక్కసారి అతను ఫామ్ అందుకుంటే మ్యాచ్ విన్నర్‌గా నిలుస్తాడు. కాబట్టి సంజు శాంసన్ ఫామ్ గురించి మాకు ఎలాంటి ఆందోళన లేదు" అని స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పష్టం చేశాడు. గణాంకాలను పరిశీలిస్తే.. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో సంజు శాంసన్ రికార్డు అంత ఆశాజనకంగా లేదు. ఈ స్టేడియంలో ఇప్పటివరకు 6 ఇన్నింగ్స్‌లలో సంజు శాంసన్ కేవలం 66 పరుగులు మాత్రమే చేశాడు. ఇక్కడ సంజు శాంసన్ సగటు 11 కాగా.. స్ట్రైక్ రేట్ 100గా ఉంది. ఐపీఎల్‌లో కనీసం 5 ఇన్నింగ్స్‌లు ఆడిన స్టేడియాల్లో సంజు శాంసన్‌కు ఇదే అత్యల్ప సగటు కావడం గమనార్హం. అయినప్పటికీ.. సీజన్లో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయని.. సంజు శాంసన్ ఖచ్చితంగా పుంజుకుంటాడని సీఎస్కే యాజమాన్యం ధీమా వ్యక్తం చేస్తోంది. గత సీజన్లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్.. ఈ సీజన్లో కూడా ఆరంభంలోనే వరుసగా రెండు ఓటములను చవిచూసింది. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో ఓటమి పాలైన సీఎస్కే.. ఇప్పుడు తన తదుపరి మ్యాచ్‌లో ఢిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో తలపడనుంది. ఆదివారం జరగబోయే ఈ కీలక పోరులోనైనా సంజు శాంసన్ ఫామ్‌లోకి వచ్చి జట్టుకు తొలి విజయాన్ని అందిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.




# అడివి శేష్ 'డెకాయిట్' ట్రైలర్ విడుదల

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన మోస్ట్ అవైటెడ్ రివెంజ్ అండ్ యాక్షన్ డ్రామా 'డెకాయిట్' (ఝుషేశీఫ్). ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఎప్పుడూ థ్రిల్లర్ కథలతో మెప్పించే అడివి శేష్ ఈసారి పూర్తి భిన్నంగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. హరి (అడివి శేష్), జూలియట్ (మృణాల్ ఠాకూర్)ల మధ్య గాఢమైన ప్రేమ కథతో మొదలైన ట్రైలర్.. ఆ తర్వాత ఊహించని నమ్మకద్రోహం, జైలు జీవితం, రివెంజ్ డ్రామాగా మారి ఉత్కంఠ రేపుతోంది. ఒక సాధారణ ప్రేమికుడు పరిస్థితుల ప్రభావం వల్ల 'డెకాయిట్'గా ఎలా మారాడనేదే ఈ చిత్ర ప్రధానాంశంగా తెలుస్తోంది. ఈ చిత్రంతో షానీల్ డియో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తూ టాలీవుడ్‌లోకి అడుగు పెడుతుండగా వీరితో పాటు ప్రకాష్ రాజ్, అతుల్ కుల్కర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ ఈ భారీ పాన్-ఇండియా చిత్రాన్ని నిర్మిస్తుంది. భీమ్స్ సిసిరోలియో అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది.



# రష్మిక ఖాతాలో మరో అరుదైన ఘనత..

పాన్ ఇండియా అగ్ర కథానాయికగా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది రష్మిక మందన్నా. అభిమానులు ముద్దుగా నేషనల్ క్రష్ అంటూ పిలుచుకునే ఈ అమ్మడు ఇటీవలే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. చాలా కాలంగా విజయ్ దేవరకొండతో ప్రేమలో ఉన్న రష్మిక.. ఈ ఏడాది ఇరు కుటుంబ సమక్షంలో పెళ్లి చేసుకుంది. ఇప్పుడు రష్మిక తెలుగింటి కోడలు.మరోవైపు ఇటీవలే ఉత్తమ నటిగా గద్దర్ ఫిల్మ్ అవార్డు అందుకుంది రష్మిక. తాజాగా మరో అంతర్జాతీయ ఘనత సొంతం చేసుకున్నారు. జపాన్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకమైన క్రంచీరోల్ యానిమే అవార్డుల వేడుకలో వరుసగా రెండోసారి ప్రెజంటర్ గా వ్యవహరించే అరుదైన అవకాశం దక్కించుకుంది. గతంలో 2024లో ఈ వేదికపై మెరిసింది రష్మిక. ఇప్పుడు మరోసారి సందడి చేయనుంది.రెండుసార్లు ఈ గౌరవం పొందిన తొలి భారతీయ సినీ సెలబ్రెటీగా రికార్డు క్రియేట్ చేసింది రష్మిక. యానిమేటెడ్ చిత్రాలు, వెబ్ సిరీస్ లలో ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే ఈ పురస్కారాల 10వ ఎడిషన్ వేడుక మే 23న టోక్యోలో ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో కలిసి ఆమె విజేతలకు అవార్డులను అందజేయనున్నారు.పుష్ప సినిమాలోని శ్రీవల్లి పాత్రతో రష్మికకు జపాన్ లో భారీ క్రేజ్ ఏర్పడింది. ఇంటర్నేషనల్ లెవల్లో రష్మికకు భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. ఇటీవలే యానిమల్, పుష్ప 2, కుబేర, గర్ల్ ఫ్రెండ్, థామా వంటి చిత్రాలతో వరుస హిట్స్ అందుకున్న ఆమె.. ప్రస్తుతం మైసా, రణబాలి చిత్రాల్లో నటిస్తున్నారు.రణబాలి చిత్రంలో మరోసారి విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలు సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కాంబో రిపీట్ కాబోతుండడంతో రణబాలి చిత్రంపై మరింత ఆసక్తి నెలకొంది. మైసా, రణబాలి సినిమాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

# ఎల్లమ్మ కథకు దేవిశ్రీ అయితేనే సరిపోతాడు

## క్లారిటీ ఇచ్చిన దర్శకుడు బలగం వేణు




'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించ బోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా? కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం , భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు? 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# కియారా లుక్‌కి ఫిదా అవుతున్న ఫ్యాన్స్

కెరీర్ పీక్స్ మీదున్నప్పుడు పెళ్లి చేసుకోవడం, వెంటనే గర్భం దాల్చడం, కొన్నాళ్లకు మళ్లీ సెట్స్ మీదకు వచ్చేయడం.. మరి ఈ ప్రాసెస్ వాళ్ల ఫిజిక్‌ని ఎఫెక్ట్ చేస్తుందా? గతంలో ఉన్నంత ఫిట్‌గా కనిపిస్తున్నారా? వై నాట్ అంటున్నారు మన నాయికలు. హాయిగా తమ పని తాము చేసుకుపోవడానికి రెడీ అవుతున్నారు. పోస్ట్ ప్రెగ్నెన్సీ రీసెంట్‌గా ఓ అవార్డుల వేడుకకు హాజరయ్యారు కియారా అద్వానీ. మునుపున్నంత ఫిట్‌గా ఉన్న ఆమెని చూసి వావ్ అనకుండా ఉండలేకపోయారు జనాలు. అలా ఎలా సాధ్యం అంటూ ఆరా తీసే వాళ్ల సంఖ్య కూడా చాలానే ఉంది. పాప పుట్టాక ఆడపులిగా మారానంటున్నారు కియారా. కెరీర్ పరంగా తానెప్పుడూ ప్రొఫెషనల్‌గానే ఉంటానని, ఆ ప్లానింగ్ ఇప్పుడు చాలా ఉపయోగపడుతోందన్నారు. సినిమాలు చూడటం, సినిమాల గురించి మాట్లాడటం, షికార్లకెళ్లడం.. ఎందులోనూ మార్పు రాలేదన్నారు. మరింత ఫిట్‌గా ఉండాలన్న ఉత్సాహం వస్తోందన్నారు మిసెస్ మల్హోత్రా. పాప పుట్టార ఆలియా కూడా మునుపటిలాగా మారారు. స్క్రీన్ మీద ఏమాత్రం మార్పు లేకుండా మెప్పించారు ఆలియా. అందుకు ఫిట్‌నెస్ ట్రైనింగ్ చాలా ఉపయోగపడిందని, ఫ్యామిలీ సపోర్ట్ మర్చిపోలేనని చెప్పారు ఆలియా. పాప పుట్టాక ఇంట్లో కాసింత ఎక్కువ సమయాన్ని గడిపిన లేడీ దీపిక పదుకోన్. జీవితం మునుపటిలా లేదన్నారు దీపిక. ప్రపంచం అంతా పాప చుట్టూనే ఉన్నట్టుందని చాలా సార్లు షేర్ చేసుకున్నారు. ప్రస్తుతం దీపికకు మల్టిపుల్ ప్రాజెక్టులు సెట్స్ మీదున్నాయి. మరి వీటితో ఈ బ్యూటీ ఎలా అలరించడానికి సిద్ధమవుతున్నారో లెట్స్ వెయిట్ అండ్ సీ...

# వీరభద్రుడి విశ్వరూపం



తమిళ అగ్ర హీరో సూర్య తాజా తమిళ చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదల కానుంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మిస్తున్నారు. మే 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం తెలుగు టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సూర్య భారీ ఖడ్గాన్ని చేతపట్టుకొని పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు.పేదల పక్షాన పోరాడి వారికి అండగా నిలబడే న్యాయవాదిగా ఈ సినిమాలో సూర్య కనిపించనున్నారు. సామాజిక, ఆధ్యాత్మిక అంశాల కలబోతగా యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వీరభద్రుడిగా సూర్య విశ్వరూపం ప్రేక్షకులకు గూజ్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సాయిఅభ్యంకర్, రచన-దర్శకత్వం: ఆర్జే బాలాజీ.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town - 518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831